ఎమ్మెల్సీ గద్దెపై గాదె

ద్వితీయ ప్రాధాన్య ఓట్లతో శ్రీనివాసులునాయుడు విజయం

అభ్యర్థి	మొదటి ప్రాధాన్య ఓట్లు
గాదె శ్రీనివాసులునాయుడుకు	7,210
పాకలపాటి రఘువర్మకు	6,845
కోరెడ్ల విజయగౌరి	5,804



ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొందిన అనంతరం ధ్రువీకరణ పత్రం చూపుతున్న గాదె శ్రీనివాసులునాయుడు

- ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన ఓట్ల లెక్కింపు
- ముగ్గురి మధ్య హోరాహోరీ
- తొలి రౌండ్ నుంచి స్వల్ప మెజారిటీతో కొనసాగిన గాదె
- తాజా విజయంతో మూడోసారి మండలిలోకి...



గాదె శ్రీనివాసులునాయుడు విజయోత్సవం

విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి):

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసులునాయుడు విజయం సాధించారు. ఓట్ల లెక్కింపు తొలి రౌండ్ నుంచి ఉత్కంఠభరితంగా సాగింది. చివరకు ద్వితీయ ప్రాధాన్య ఓట్లతో గాదె తన సమీప ప్రత్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మపై గెలుపొందారు. పది మంది అభ్యర్థులు పోటీలో ఉన్నప్పటికీ కౌంటింగ్ ప్రారంభమైనప్పటి నుంచి ముగిసేంత వరకు ముగ్గురి మధ్యే ప్రధాన పోటీ నెలకొంది.

గత నెల 27వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికలు జరగ్గా, ఓట్ల లెక్కింపు సోమవారం ఉదయం ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాల (ఈఈఈ భవనం)లో చేపట్టారు. ఆరు జిల్లాల పరిధిలోని 123 బ్యాలెట్ బాక్సుల్లోని ఓట్లను లెక్కించేందుకు 20 టేబుళ్లను ఏర్పాటుచేశారు. ఉదయం 8 గంటలకు స్ట్రాంగ్ రూమ్ తెరిచి అభ్యర్థుల సమక్షంలో బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ హాల్‌కు తీసుకువచ్చారు. బాక్సుల్లోని బ్యాలెట్ పత్రాలను బయటకు తీసి 25 చొప్పున కట్టలు కట్టి డ్రమ్ముల్లో వేశారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేసరికి 11 గంటలు అయ్యింది. ఆ తరువాత ఒక్కో టేబుల్‌కు వేయి చొప్పున సర్దుబాటు చేశారు. వీటిని ఏజెంట్ల సమక్షంలో ఆయా టేబుళ్లకు

... మిగతా 6వ పేజీలో

మూడోసారి ఎమ్మెల్సీ

గాదె శ్రీనివాసులునాయుడు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నిక కావడం ఇది మూడోసారి. విజయనగరం జిల్లాకు చెందిన గాదె అదే ప్రాంతంలో ఉపాధ్యాయుడుగా పనిచేసేవారు. 2007లో శాసన మండలిని పునరుద్ధరించిన తరువాత ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికను నిర్వహించారు. ఈ ఎన్నికల్లో పోటీ చేసిన శ్రీనివాసులు నాయుడు తొలిసారి విజయం సాధించి శాసనమండలిలో అడుగుపెట్టారు. ఆ తరువాత 2013లో మరోసారి పోటీ చేసి విజయం సాధించిన ఆయన... 2019లో జరిగిన ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. తాజాగా జరిగిన ఎన్నికల్లో మరోసారి పోటీ చేసి విజయం సాధించారు. మొత్తంగా నాలుగుసార్లు పోటీ చేసిన ఆయన మూడుసార్లు ఎమ్మెల్సీగా విజయం సాధించారు.

ఉపాధ్యాయుల నమ్మకాన్ని వమ్ముచేయను


- ఎమ్మెల్సీ విజేత గాదె శ్రీనివాసులునాయుడు



కలెక్టర్ హరేంధిరప్రసాద్ నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న శ్రీనివాసులునాయుడు

విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తనపై ఉపాధ్యాయులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయబోనని గాదె శ్రీనివాసులునాయుడు ప్రకటించారు. సోమవారం రాత్రి పదకొండు గంటలకు రిటర్నింగ్ అధికారి నుంచి ధ్రువీకరణ పత్రం అందుకున్న ఆయన కౌంటింగ్ కేంద్రం బయట విలేకరులతో మాట్లాడారు. ఈ గెలుపులో భాగస్వామ్యమైన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. తనకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని ప్రకటించారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషిచేస్తానని పేర్కొన్నారు. మొదటిగా 2007లో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యానని, అప్పటి నుంచి టీచర్ల పక్షాన పనిచేశానని, అదే అభిమానంతో 2013లో మరోసారి గెలిపించారన్నారు.

ఎగుమతుల కేంద్రంగా విశాఖ



- సముద్ర ఉత్పత్తులు, ఇంజనీరింగ్, ఆరోగ్య సేవలు...
- పర్యాటక అభివృద్ధికి క్రూయిజ్ నౌకలు, సీ ప్లేన్లు నడపాలనే ఆలోచన
- స్వర్ణాంధ్ర విజన్ 2047కు అనుగుణంగా జిల్లా అభివృద్ధికి విజన్ మానటరింగ్ యూనిట్
- సముద్ర ఉత్పత్తులు పెంచడానికి ఓపెన్ సీ కేజ్ కల్చర్, డీప్ సీ ఫిషింగ్‌కు ప్రోత్సాహం
- మేహాద్రిగెడ్డలో 3 మెగావాట్ల సోలార్ ప్లాంటు
- విశాఖ నుంచి భీమిలి (బీచ్‌రోడ్డు)కి 6/8 వరుసల ఎక్స్‌ప్రెస్ వే
- సామాజిక, ఆర్థిక సర్వేలో వెల్లడి



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం జిల్లాను సముద్ర ఉత్పత్తులు, ఇంజనీరింగ్ వర్కులు, ఆరోగ్య సేవల ఎగుమతి కేంద్రంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో సాధించిన ప్రగతి, భవిష్యత్తులో చేపట్టబోతున్న పనులు, అమలు చేస్తున్న పథకాలు, అందుకుంటున్న లబ్ధిదారుల వివరాలను రాష్ట్ర ప్రణాళిక విభాగం బడ్జెట్ సమావేశాల్లో సమర్పించింది.

స్వర్ణాంధ్ర విజన్ 2047కు అనుగుణంగా జిల్లా అభివృద్ధికి ప్రణాళిక రూపొందించి దానిని అమలు చేసే బాధ్యతను జిల్లా కేంద్రం విజన్ మానటరింగ్ యూనిట్‌కు బాధ్యతలు అప్పగించింది. నియోజకవర్గ, మండల స్థాయిల్లో సమీక్షలు నిర్వహించి లక్ష్య సాధనకు ముందుకు వెళ్లాలని దిశా నిర్దేశం చేసింది. తలసరి ఆదాయం పెంచడం, ఉపాధి అవకాశాలు అందరికీ అందేలా చేయడం, అన్ని విభాగాల్లో మహిళలకు పనిచేసే అవకాశం కల్పించడం, వ్యవసాయ ఉత్పత్తుల పెంపు, స్థూల ఆదాయంలో పర్యాటక రంగం వాటా పెంపు, పునరుత్పాదక ఇంధనాల వినియోగం, 95 శాతం మందికి నైపుణ్య శిక్షణ ఇవ్వడం వంటి ప్రధాన లక్ష్యాలుగా పేర్కొంది. పేదరికం నిర్మూలనే లక్ష్యంగా ఈ ప్రణాళిక అమలు చేయాలని సూచించింది.

జనాభా నిర్వహణ, నీటి భద్రత, ఉద్యోగ నైపుణ్యం, ఉత్తమ రవాణా సేవలు, అన్ని శాఖల్లో డీప్ టెక్నాలజీ వినియోగం, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ ప్రధాన అంశాలుగా ఉండాలని నిర్దేశించింది. అలాగే విశాఖ జిల్లాలో పర్యాటకం అభివృద్ధికి క్రూయిజ్ నౌకలు, సీ ప్లేన్లు నడపాలనే ఆలోచన ఉందని, ప్రణాళికలు రూపొందించామని

... మిగతా 6వ పేజీలో

జ్ఞానవేణికి ఉద్వాసన

జిల్లా పర్యాటక శాఖ అధికారిణి బాధ్యతల నుంచి తప్పించి మాతృశాఖకు పంపుతూ ఉత్తర్వులు

- విజయనగరం జిల్లా అధికారికి బాధ్యతలు అప్పగింత
- ఆర్‌డీ బాధ్యతల నుంచి ఈఈ రమణ అవుట్
- డీవీఎంకు అదనపు బాధ్యతలు
- రుషికొండ బీచ్‌కు బ్లూఫ్లాగ్ గుర్తింపు రద్దు నేపథ్యంలో తూతూమంత్రంగా చర్యలు



జ్ఞానవేణి



ఈఈ రమణ



విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పర్యాటక శాఖ అధికారుల అవినీతి, అంతర్యుద్ధం గురించి తెలిసినా ఆరు నెలలుగా నోరు మెదపని పెద్దలు రుషికొండ బీచ్‌కు బ్లూ ఫ్లాగ్ గుర్తింపు ఉపసంహరణతో ఇక తప్పదన్నట్టుగా తూతూమంత్రంగా చర్యలు చేపట్టారు. పర్యాటక శాఖ అధికారులు వర్గపోరుతో రుషికొండ బీచ్ నిర్వహణను గాలికి వదిలేశారు. దీంతో బీచ్‌కు బ్లూ ఫ్లాగ్ గుర్తింపు తాత్కాలికంగా రద్దయ్యింది. దీంతో పరువు పోయిందని పర్యాటక శాఖ ఉన్నతాధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు.

జిల్లా పర్యాటక శాఖ అధికారిణి జ్ఞానవేణి, టూరిజం అథారిటీలో ఈఈగా పనిచేస్తూ రీజనల్ డైరెక్టర్ (ఆర్‌డీ)గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న రమణల మధ్య సమన్వయం లేదని, ఇద్దరూ శాఖలో అంతర్యుద్ధం చేస్తూ పర్యాటక అభివృద్ధిని విస్మరించారని పేర్కొంటూ చర్యలు చేపట్టింది. రెవెన్యూ శాఖలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తూ డిప్యుటేషన్‌పై పర్యాటక శాఖకు వచ్చిన జ్ఞానవేణిని మళ్లీ వెనక్కి పంపుతూ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. అలాగే ఈఈ రమణకు ఇచ్చిన ఆర్‌డీ అదనపు బాధ్యతలు తప్పించారు. ప్రస్తుతం డివిజనల్ మార్కెటింగ్ మేనేజర్‌గా పనిచేస్తున్న వీబీ జగదీశ్‌కు ఆర్‌డీ బాధ్యతలు అప్పగించారు. ఇక జ్ఞానవేణి స్థానంలో విజయనగరం జిల్లా పర్యాటక శాఖ అధికారి దాస్‌ను నియమించారు. ఆయన అల్లూరి జిల్లా పర్యాటక శాఖ అధికారిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆ జిల్లాను కూడా ఇక్కడి నుంచే చూడాలని సూచించారు.

ఇంజనీరింగ్ అధికారిని మార్చరా?

పర్యాటక శాఖలో ఈఈ రమణపై అనేక ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ హయాంలో రూ.500 కోట్లతో

... మిగతా 6వ పేజీలో

పన్ను వసూళ్లపై గ్రేటర్ దృష్టి

ఈ ఆర్థిక సంవత్సరం లక్ష్యం రూ.470 కోట్లు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మరో 27 రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుండడంతో జీవీఎంసీ అధికారులు ఆస్తి పన్ను వసూళ్లపై గట్టిగా దృష్టిపెట్టారు. ఈ ఏడాది పన్నుతో పాటు బకాయిలను కూడా రాబట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో గడిచిన ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పన్నుల వసూళ్లలో పురోగతి కనిపిస్తోంది.

- గత నెల 28 వరకూ వసూలైంది రూ.357 కోట్లు
- ఒక్క ఫిబ్రవరిలోనే రూ.62 కోట్లు
- మొండి బకాయిల వసూలుపైనా దృష్టి
- నెలాఖరులోగా చెల్లించని పక్షంలో ఆస్తి జప్తు చేస్తామని నోటీసులు
- నీటి పన్ను బకాయిల వసూలుకూ చర్యలు

జీవీఎంసీలో మొత్తం ప్రైవేటు అసెస్‌మెంట్‌లు	6,11,056
ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రావాల్సిన ఆస్తిపన్ను	రూ.470 కోట్లు
గత నెల 28 వరకు వసూలైన మొత్తం	రూ.357 కోట్లు
ఆస్తిపన్ను బకాయిలు ఉన్న అసెస్‌మెంట్‌లు	రూ.1,13,236
వాటి నుంచి రావాల్సిన బకాయిలు	రూ.56 కోట్లు

జీవీఎంసీ పరిధిలో 6,11,056 అసెస్‌మెంట్‌లు ఉన్నాయి. వీటి నుంచి ఈ ఏడాది ఆస్తి పన్ను రూపేణా రూ.470 కోట్లు వసూలుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గత నెల 28వ తేదీ నాటికి రూ.357 కోట్లు వసూలు చేశారు. మిగిలిన మొత్తాన్ని వచ్చే 28 రోజుల్లో వసూలు చేసేందుకు రెవెన్యూ విభాగం డిప్యూటీ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ ప్రారంభించారు. ప్రతి వారం అన్నిజోన్‌ల రెవెన్యూ అధికారులు, సిబ్బందితో అదనపు కమిషనర్ సోమన్నారాయణ, డీసీఆర్ శ్రీనివాసరావు సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఆస్తి పన్ను కింద గడచిన ఆర్థిక సంవత్సరం రూ.444 కోట్లు వసూలుచేయాలని లక్ష్యంగా పెట్టుకుంటే, ఫిబ్రవరి 28 నాటికి రూ.326 కోట్లు వసూలు చేశారు. అదే ఈ ఏడాది... రూ.470 కోట్లు లక్ష్యంగా పెట్టుకుంటే ఫిబ్రవరి 28 నాటికి రూ.357 కోట్లు వసూలుచేశారు. ఈ ఏడాది జనవరి నాటికి రూ.295 కోట్లు వసూలైతే, ఒక్క ఫిబ్రవరి

... మిగతా 6వ పేజీలో

వాట్సాప్ ద్వారా టెన్త్ హాల్ టికెట్లు

మన మిత్ర ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం

- వాట్సాప్ నంబర్ 95523 00009
- స్కూలు లాగిన్ నుంచి హెచ్‌ఎంలు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు
- డీఈవో ప్రేమ్‌కుమార్

ఆరిలోవ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మార్చి 17 నుంచి జరగనున్న పదో తరగతి వార్షిక పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల హాల్‌టిక్కెట్లను స్కూలు లాగిన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చునన్నారు. హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసిన తరువాత విద్యార్థుల వివరాలు...పేరు,

... మిగతా 6వ పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళ)	6.07
సహరి (బుధ)	4.56

విద్యార్థులు ప్రతిరోజూ తరగతులకు హాజరుకావాలి

- నియమావళిని పాటించేలా విభాగాధిపతులు, ప్రిన్సిపాల్స్ చూడాలి
- క్రమశిక్షణకు అధిక ప్రాధాన్యం

ఏయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్



ఏయూ ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, ప్రొఫెసర్ల సమావేశంలో మాట్లాడుతున్న వీసీ రాజశేఖర్

విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయంలో క్రమశిక్షణను పెంపొందించేందుకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని ఏయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ పేర్కొన్నారు. సోమవారం ఇంజనీరింగ్, ఆర్ట్స్, న్యాయ, సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, ప్రొఫెసర్లతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి విభాగంలో ఉన్న ఇబ్బందులు, కల్పించాల్సిన మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వీసీ రాజశేఖర్ మాట్లాడుతూ తరగతుల నిర్వహణ సక్రమంగా జరగాలన్నారు. విద్యార్థులు పూర్తిస్థాయిలో తరగతులకు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. ప్రతి తరగతిలో విద్యార్థులు పాటించాల్సిన నియమావళిని వివరించాలని, వారంతా తప్పనిసరిగా అనుసరించేలా ప్రొఫెసర్లు, విభాగాధిపతులు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల హాజరు శాతం తగ్గకూడదని స్పష్టంచేశారు. విద్యార్థులు ప్రతిరోజూ తరగతులకు వచ్చినప్పుడే వారిలో నైపుణ్యాలు మెరుగుపడతాయని, భవిష్యత్తులో ఉన్నత అవకాశాలు పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. త్వరలో విభాగాల వారీగా సమీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రతి

... మిగతా 6వ పేజీలో

వైభవంగా సింహాద్రినాథుడి నిత్య కల్యాణం



కల్యాణం చేస్తున్న వైదికులు

సింహాచలం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రహ్లాదవరదుడు సింహాద్రినాథుడి నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపసేవ వంటి ప్రభాతారాధనలు యథావిధిగా పూర్తి చేశారు. ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణలు చేసి వేదమంత్రాలు,మంగళవాయిద్యాల నడుమ జీలకర్రా బెల్లం, మాంగళ్య ధారణలు జరిపారు. స్వామికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

మందుబాబులకు జరిమానా

ఆనందపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలో ఇటీవల చేపట్టిన తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి 15వ అదనపు మెట్రోపాలిటన్ కోర్టు సోమవారం భారీ జరిమనాలు విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడిపిన 35 మందిని కోర్టులో హజరుపరచగా ఒక్కొక్కరికి 10 వేల రూపాయలు చొప్పున 35 వేల రూపాయలు జరిమానా విధిస్తూ జడ్జి డి.సౌజన్య తీర్పు వెలువరించారు.

ఈ సందర్భంగా ఎస్ పాపారావు మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాలు నడిపినా, హెల్మెట్ ధరించకున్నా చర్యలు తప్పవని హెచ్చరించారు.

యుద్ధంలోనూ ధర్మం వీడని రారాజు శ్రీరాముడు

» ప్రముఖ ఆద్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు

కొమ్మాది, మార్చి3 (ఆంధ్రజ్యోతి) : యుద్ధంలో కూడా ధర్మాన్ని పాటించే మహోన్నత వ్యక్తి రాముడు అని ప్రముఖ ఆద్యాత్మిక ప్రవచనకర్త, 'బ్రహ్మశ్రీ' చాగంటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. కొమ్మాదిలోని గాయత్రి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న సంపూర్ణ రామాయణం ప్రవచనాల్లో భాగంగా సోమవారం 'యుద్ధకాండలో ఇంద్రజిత్తు, రావణాసుర, కుంభకర్ణులు-రామలక్ష్మణులు, వానరసైన్యానికి మద్య జరిగిన యుద్ధం గురించి వివరించారు. రామలక్ష్మణులు వానరసైన్యంతో కలిసి ఇంద్రజిత్తు రథము, గుర్రమును నాశనం చేయగా.., ఇంద్రజిత్తు ఆకాశంలోకి ఎగిరిపోయి మేఘాల చాటున దాగి మాయా యద్ధం ప్రారంభించాడని, అతడి వేగాన్ని నిరోధించమని రాముడు వానరులను పంపినప్పటికీ ఇంద్రజిత్తు వారికి దొరకకుండా వానరుల వేగాన్ని అతడు నియంత్రించాడన్నారు. అప్పుడు ఇంద్రజిత్తు కద్రువ యొక్క కుమారులైన నాగులను భయంకరమైన నాగాస్త్రాలుగా ప్రయోగించి రామలక్ష్మణులను బంధించాడని తెలిపారు. అనంతరం.. రామలక్ష్మణులు స్పృహలోకి వచ్చిన తరువాత నాగాస్త్ర బంధాన్ని విడిపించుకునే పరిస్థితి లేదని తెలుసుకుని, విభీషణుడ్ని పట్టాభిషిక్తుడిని చేస్తానని ఇచ్చిన మాట నేరవేర్చలేకపోతున్నందుకు బాధపడ్డాడని తెలిపారు. అదే సమయంలో భయంకరమైన గాలితో గరుత్మంతుడు అక్కడికి రాగా, ఆయనను చూసి నాగులన్ని పారిపోయాయని రామలక్ష్మణులిద్దరూ నాగాస్త్ర బంధం నుంచి విముక్తులయ్యారని తెలిపారు. రావణుడి సర్వసైన్యాధిపతి ప్రహస్తుడిని.. వానర సర్వసైన్యాధిపతి నీలుగు సంహరించగా, తరువాత రావణుడు స్వయంగా యుద్ధానికి వచ్చాడని... రావణుడితో సుగ్రీవుడు, హనుమ యుద్ధం చేసిన అనంతరం లక్ష్మణుడు కూడా యుద్ధం చేయగా ఆయనపై రావణాసురుడు బ్రహ్మాస్త్రం శక్తిని ప్రయోగించాడని లక్ష్మణుడు స్పృహతప్పి పడిపోయాడు. అతడిని లంకలోకి తీసుకువెళదామని ప్రయత్నించగా.. విష్ణుశక్తి ఆవహించటం చేతతో లక్ష్మణుడ్ని రావణుడు ఎత్తలేకపోయాడని తెలిపారు. తరువాత హనుమ భుజాలపై నుంచి రాముడే రావణుడితో యుద్ధానికి తలపడ్డాడని శ్రీరాముడు రావణుడి రథం, ధనుస్సు, కిరీటాలను పడగొట్టి రావణుడ్ని నిర్వీర్యుడ్ని చేశాడని, అలసిపోయి ఓడిపోవటానికి సిద్ధంగా ఉన్న రావణుడితో ధర్మం పాటించి యుద్ధం చేయకుండా వదలిపెట్టాడని తెలిపారు. రాక్షసులు కుంభకర్ణుడిని మేల్కొలుపుట, కుంభకర్ణుడి వధ ఘట్టాలను వివరించారు. కార్యక్రమంలో అష్టలక్ష్మీ దేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణ, గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి సోమరాజు పాల్గొన్నారు.



రామయంత్రానికి పూజలు చేస్తున్న చాగంటి కోటేశ్వరరావు

పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

భీమిలి డివిజన్ పశుసంవర్ధకశాఖ ఏడీ జీవీ రమణ వెల్లడి

పద్మనాభం-రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఉచితంగా వేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు భీమిలి డివిజన్ పశుసంవర్ధకశాఖ ఏడీ బీవీ రమణ తెలిపారు. సోమవారం అయన పద్మనాభం, ఆనందపురం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఏడీ రమణ మాట్లాడుతూ మార్చి 1 నుంచి 31వ తేదీ వరకు పశువులకు ఉచితంగా టీకాలు వేయనున్నట్లు తెలిపారు. పశువులకు తీవ్ర జ్వరం, నీరసం, కాలిగిట్టల మధ్య పుండ్లు, చూడి పశువులు ఈనకపోవడం వంటి లక్షణాలు గాలి కుంటువ్యాధి కిందకు వస్తాయన్నారు. ఇది ఒక పశువు నుంచి మరో పశువుకు సంక్రమించే అవకాశం ఉండటంతో రైతులకు ఆర్థికంగా నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. టీకాలు వేయడం వల్ల వ్యాధి సోకిన పశువుల్లో తగ్గేపాల ఉత్పత్తిని శాశ్వతంగా నివారించవచ్చని, దూడల్లో మరణాలుతగ్గించి ఆరోగ్యంగా ఎదగడానికి దోహదపడుతుందని ప్రభుత్వం అందించే టీకాలు వేయించడం ద్వారానే ట్రూసెల్లో వ్యాధి నివారించవచ్చన్నారు. మూడు నెలలు దాటిన ప్రతి పశువుకు తప్పని సరిగా టీకాలు వేయించాల్సి ఉంటుందన్నారు. నాలుగు నుంచి ఎనిమిది నెలలు వయస్సు గల పెయ్యి, దూడలకు బ్రూసెల్లోస్ టీకాలు వేయించాలని అయన కోరారు. పాడి రైతులు సకాలంలో సద్వినియోగం చేసుకోవాలని అయన పేర్కొన్నారు.

మహిళా దినోత్సవం సందర్భంగా బాలికల సైకిల్ ర్యాలీ



రేవిడిలో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న బాలికలు

పద్మనాభం, మార్చి3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేవిడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం హైస్కూల్ బాలికలతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్తలు ర్యాలీ చేసి మహిళ సమానత్వంపై నినాదాలు చేశారు. ఈసందర్భంగా ఈఏడాది నినాదమైన 'మహిళలు, బాలికలందరికీ హక్కులు-సమానత్వం, సాధికారత' అన్న అంశంపై నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. అన్ని ప్రధాన వీధులలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకరరావు, ఐసీడీఎస్ పీవో శ్రీదేవి, సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యానికి డబ్బులివ్వలేదని ఆత్మహత్య



శివకృష్ణ (ఫైల్‌ఫోటో)


గోపాలపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసైన ఓ వ్యక్తి మందు తాగడానికి కుటుంబ సభ్యులు డబ్బులి వ్వకపోవడంతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరా లిలా ఉన్నాయి.

లక్ష్మీనగర్‌కు చెందిన గోక శివకృష్ణ (35) ఉల్లిపాయల వ్యాపారం చేస్తుంటాడు. శివకృష్ణ మద్యానికి బానిసవడంతో భార్య విడిచిపెట్టి వెళ్లిపోయింది. తల్లిదండ్రులతో నివ సిస్తున్న శివకృష్ణ తరచూ మద్యం కొనుగోలుకు డబ్బులివ్వాలంటూ వేధించేవాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం తల్లిదండ్రులు డబ్బులు ఇవ్వక పోవడంతో ఇంట్లో ఎవ రూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని శివకృష్ణ ఆత్మహత్యకు పాల్పడ్డాడు.ఆ తరు వాత ఇంటికి వచ్చిన కుటుంబీకులు గోపాలపట్నం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని శివకృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి తల్లి దమయంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ గొలగాని అప్పారావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పన్న ఆలయ పైకప్పునకు మరమ్మతులు

9 నెలల్లోగా పనుల పూర్తికి ఎంవోయూ

సింహాచలం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయ పైకప్పు నుంచి వర్షపు నీరు లీక్ అవ్వకుండా నిరోధించే పనులను ప్రారంభించారు. గతనెల రెండో వారంలో పుణేకు చెందిన లార్డు వేంకటేశ్వర రీలిజియస్ అండ్ చారిటబుల్ ట్రస్టు అప్పన్న ఆలయ పైకప్పునకు రూ.నాలుగు కోట్ల వ్యయంతో మరమ్మతులు చేసేందుకు ఎంవోయూ కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా రెండు రోజులుగా ఆలయ పైకప్పుపై వర్షపు నీరు లీక్ అవుతున్న ప్రాంతాల్లో కొంతభాగాన్ని తొలగించే ప్రక్రియను చేపట్టారు. అనంతరం సనాతన విధానంలో తయారుచేసిన ప్రత్యేక పేస్టుతో మరమ్మతులు చేయనున్నారు. ఈ పనులను 9 నెలల్లోగా పూర్తి చేస్తామని ఎంవోయూలో పేర్కొన్నారు.



పనుల్లో నిమగ్నమైన కార్మికులు

జ్ఞానవేణికి ఉద్వాసన

... 5వ పేజీ తరువాయి

రుషికొండపై నిర్మించిన ప్యాలెస్ పనులను ఆయనే దగ్గరుండి పర్యవేక్షించారు. రుషికొండపై అంతకుముందున్న హరిత రిసార్ట్‌లోని ఫర్నీచర్‌ను అమ్ముకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రమణను తప్పించాలని విశాఖ జిల్లా ప్రజా ప్రతినిధులు కొందరు నేరుగా పర్యాటక శాఖ పెద్దలనే కోరారు. ఆర్‌డీగా అదనపు బాధ్యతలు ఇవ్వడం తగదని సూచించారు. ఆర్‌డీ కార్యాలయంలో సిబ్బంది కూడా ఆదాయం కోసం వెంపర్లాడుతున్నారని, వారిని కూడా మార్చాలని కోరారు. కానీ పర్యాటక శాఖ పెద్దలు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. విశాఖ నేతలు సూచించిన అధికారుల పేర్లను పక్కన పెట్టారు. ఇప్పుడు రుషికొండలో ఇంత రచ్చ జరిగిన తరువాత కూడా ఆ శాఖలో వారితోనే కుర్చీలాట ఆడారే తప్ప కఠిన చర్యలు ఏమీ తీసుకోలేదు. రమణను ఆర్‌డీగా తప్పించి అదే శాఖలో ఇక్కడే ఈఈగా ఉంచారు. రెండు జిల్లాల బాధ్యతలు చూస్తున్న దాస్‌ను తీసుకువచ్చి విశాఖ పర్యాటక శాఖ జిల్లా అధికారిగా నియమించారు. అలాగే డీవీఎంగా బిజీగా ఉండే జగదీశ్‌కు ఆర్‌డీగా అదనపు బాధ్యతలు ఇచ్చారు. పూర్తిస్థాయి అధికారులను వేయడానికి ఆ శాఖలో పెద్దలకు కలుగుతున్న ఇబ్బంది ఏమిటో అర్థం కావడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి ఇక్కడి అధికారులను మార్చాలనే అంతా చెబుతున్నారు. కానీ ఏ కారణాల చేతనో ఈఈ రమణతోనే వ్యవహారాలన్నీ నడిపిస్తున్నారు. కొత్త వారిని రానివ్వడం లేదు. జిల్లా నేతల అభ్యర్థనలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. పర్యాటక సంస్థలో మరొకాయన...'పత్రికల్లో చిన్నవే పెద్దవిగా రాస్తారు..వాటిని పట్టించుకోవద్దు" అంటూ పెట్టుబడిదారుల సదస్సులోనే ప్రకటించి అవినీతి అధికారులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ శాఖను పూర్తిగా ప్రక్షాళన చేయడం ఆ శాఖ పెద్దలకే ఇష్టం లేనట్టుగా ఉంది.

విద్యార్థులు ప్రతిరోజూ తరగతులకు హాజరుకావాలి

... 5వ పేజీ తరువాయి

విభాగంలో ఉన్న సమస్యలను పరిష్కరించి, వసతులు మెరుగుపరిచి అభివృద్ధి దిశగా నడిపించే ప్రయత్నం జరుగుతుందన్నారు. త్వరలో శతాబ్ది ఉత్సవాలు జరుగనున్నాయని, ఈ ప్రక్రియలో ప్రతి విభాగం భాగస్వామ్యం కావాలన్నారు. అందరి సహకారంతో కార్యక్రమాలను సమర్థంగా నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎన్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇ.ఎన్. ధనుంజయరావు, ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ ఎ.నరసింహరావు, జి.శశిభూషణరావు, జి.గిరిజాశంకర్, ఎంవీఆర్ రాజు, కె.సీతామాణిక్యం, డి.నాగరాజకుమారి, ఆర్.పద్మశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ఠ



భీమునిపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి గొల్లలపాలెంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం సరస్వతీదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మద్య పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ చందవరపు కుమార్ విగ్రహప్రతిష్ఠాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సొంత నిధులతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రిన్సిపాల్ గంగాకుమారి మాట్లాడుతూ ఇక్కడ సరస్వతీదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని సమగ్రశిక్ష ఏపీసీ చంద్రశేఖరరావు, జీసీడీవో బేగం అభినందించారన్నారు.

'నాటుసారా నిర్మూలనకు నవోదయం'

తగరపువలస, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నాటుసారాను నిరోధించడానికి ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర నవోదయం పేరుతో కొత్త కార్యక్రమాన్ని చేపడుతున్నారని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీవీఎన్ బాబ్జీరావు తెలిపారు. సోమవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ నాటుసారా తయారు చేసినా, నిల్వ చేసినా, రవాణా చేసినా ప్రజలు సమాచారాన్ని అందించడానికి 14405 టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ నంబర్‌కు ఫోన్ చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచి నాటుసారా నిరోధానికి తగిన చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ గద్దెపై గాదె

... 5వ పేజీ తరువాయి



కేటాయించిన సిబ్బంది లెక్కించారు. మొత్తం 20,794 ఓట్లు పోల్ కాగా, 20,135 ఓట్లు చెల్లినవిగా, 659 ఓట్లు చెల్లనవిగా గుర్తించారు. మధ్యాహ్నం రెండు గంటల సమయానికి తొలి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు పూర్తయ్యింది. మొదటి ప్రాధాన్య ఓట్లలో గాదె శ్రీనివాసులు నాయుడుకు 7,210, పాకలపాటి రఘువర్మకు 6,845, కోరెడ్ల విజయగౌరికి 5,804 రాగా, మిగిలిన ఏడుగురు అభ్యర్థులకు వందకంటే తక్కువ వచ్చాయి. విజేతను ప్రకటించాలంటే పోలైన ఓట్లలో 50 శాతం కంటే అదనంగా ఒక్క ఓటైనా రావాలి. అంటే చెల్లిన ఓట్లు 20,1345లో 10,067 ప్లస్ ఒకటి...10,068 ఓట్లను సాధించాలి. అయితే, మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు పూర్తయ్యేసరికి పోటీలో ఉన్న అభ్యర్థులెవరూ మ్యాజిక్ ఫిగర్ దక్కించుకోకపోవడంతో రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపు అనివార్యమైంది.

రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపుతో విజయం..

మధ్యాహ్నం భోజన విరామం తరువాత రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపు ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. మొదట తక్కువ ఓట్లు లభించిన అభ్యర్థుల రెండో ప్రాధాన్య ఓట్లను లెక్కిస్తూ ఎలిమినేషన్ ప్రక్రియను చేపట్టారు. రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపులో రెండో రౌండ్‌లో పెదపెంకి శివప్రసాద్, మూడో రౌండ్‌లో ఎస్ఎస్ పద్మావతి, నాలుగు రౌండ్‌లో రాధాకృష్ణ, ఐదో రౌండ్‌లో సత్యనారాయణ, ఆరో రౌండ్‌లో శ్రీనివాసరావు, ఏడో రౌండ్‌లో దుర్గా ప్రసాద్, ఎనిమిదో రౌండ్‌లో సూర్యప్రకాష్‌ను ఎలిమినేట్ చేశారు. ఎనిమిది రౌండ్లు పూర్తయ్యేసరికి గాదె శ్రీనివాసులునాయుడుకు 7,248 ఓట్లు, పాకలపాటి రఘువర్మకు 6,881 ఓట్లు, కోరెడ్ల విజయగౌరికి 5,872 ఓట్లు లభించాయి. అప్పటికి కూడా ఎవరూ మ్యాజిక్ ఫిగర్‌కు చేరుకోకపోవడంతో మూడో స్థానంలో నిలిచిన కోరెడ్ల విజయగౌరికి లభించిన ఓట్లలో ద్వితీయ ప్రాధాన్య ఓట్లను లెక్కించారు. ఆమె ఎలిమినేషన్ తరువాత గాదె శ్రీనివాసులునాయుడు 9,237 ఓట్లు, వర్మకు 8,527 ఓట్లతో ఉన్నారు. ఈ క్రమంలో మ్యాజిక్ ఫిగర్ చేరుకోవడానికి మొదటి స్థానంలో నిలిచిన శ్రీనివాసులునాయుడుకు 831 ఓట్లు అవసరమయ్యాయి. ఆ సమయంలో రఘువర్మ కౌంటింగ్ సెంటర్ నుంచి బయటకు వెళ్లిపోయారు. అనంతరం శ్రీనివాసులునాయుడు విజయానికి అవసరమైన 831 ఓట్ల కోసం రఘువర్మకు పోలైన ఓట్లను లెక్కించారు. ఈ క్రమంలో శ్రీనివాసులునాయుడుకు 12,305 ఓట్లు వచ్చాయి. దాంతో శ్రీనివాసులునాయుడు విజయం సాధించినట్టు అధికారులు ప్రకటించారు.

మొదటి ప్రాధాన్య ఓట్లు ఎవరికెన్ని వచ్చాయంటే...

మొత్తం 20,794 ఓట్లు పోలవ్వగా 659 ఓట్లు చెల్లలేదు. మిగిలిన 20,135 ఓట్ల (మొదటి ప్రాధాన్య)లో కోరెడ్ల విజయగౌరికి 5,804, కోసూరు రాధాకృష్ణ కు 30, గాదె శ్రీనివాసులనాయుడుకు 7210, దుర్గాప్రసాద్ పోతలకు 67, నూకల సూర్యప్రకాష్‌కు 85, ఎస్.ఎస్.పద్మావతికి 15, పాకలపాటి రఘువర్మకు 6845, పెదపెంకి ప్రసాదరావుకు 15, రాయల సత్యనారాయణకు 31, సుంకరి శ్రీనివాసరావుకు 33 ఓట్లు వచ్చాయి.

'గాదె'కు ఎన్నిక ధ్రువీకరణ పత్రం అందజేత

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొందిన గాదె శ్రీనివాసులునాయుడుకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ సోమవారం రాత్రి 11 గంటలకు ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఓట్ల లెక్కింపు ముగిసిన అనంతరం వివరాలను ఎన్నికల కమిషన్‌కు పంపి, అక్కడ నుంచి అనుమతి వచ్చిన తరువాత అధికారికంగా ప్రకటించి ధ్రువీకరణపత్రం అందజేశారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు సహకరించిన అధికారులు, సిబ్బందికి కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా బందోబస్తు నిర్వహించిన పోలీసులను అభినందించారు.

ఓటమి పాలైనా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి: రఘువర్మ

విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పాకలపాటి రఘువర్మ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వెలువడడానికి కొద్ది నిమిషాలు ముందు కౌంటింగ్ కేంద్రం నుంచి బయటకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. తాను ఓటమిని అంగీకరిస్తున్నానని, అయితే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి మాత్రం పోరాటం చేస్తానని స్పష్టంచేశారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని స్పష్టం చేశారు.

ఎగుమతుల కేంద్రంగా విశాఖ

... 5వ పేజీ తరువాయి

పేర్కొంది. ఐటీ సేవలను విస్తృతం చేయడానికి మండల స్థాయిలో అధికారులతో సమీక్షలకు వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాట్లు చేస్తున్నామని, ఇకపై ఎవరూ ఎక్కడికీ వెళ్లకుండా సమీక్షల్లో పాల్గొనవచ్చునని వెల్లడించింది.

+ పరిశ్రమలకు అవసరమైన విద్యుత్‌ను నిరంతరం అందించడానికి కాపులుప్పాడ, అచ్యుతాపురం, చందనాడల్లో 900 మెగావాట్ల సామర్థ్యంతో సబ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్టు, వాటి పనులు ఇప్పటికే 65.59 శాతం పూర్తయినట్టు పేర్కొంది. వీటివల్ల 1,200 పరిశ్రమలకు విద్యుత్ సదుపాయం అందుతుంది. మేహాద్రిగెడ్డలో 3 మెగావాట్ల సోలార్ ప్లాంటు, ముడసర్లోవ పార్కు పునరుద్ధరణకు 10,650 మొక్కలు నాటినట్లు తెలిపింది. విశాఖపట్నం నుంచి భీమిలి వరకు బీచ్‌రోడ్డులో 6/8 వరుసల ఎక్స్‌ప్రెస్ వే నిర్మించనున్నట్టు వెల్లడించింది.

+ విశాఖలో సముద్ర ఉత్పత్తులు పెంచడానికి ఓపెన్ సీ కేజ్ కల్చర్, డీప్ సీ ఫిషింగ్‌ను ప్రోత్సహించనున్నారు. టూనా చేపల వేటకు అవసరమైన అధునాతన ట్రాలర్ల సమకూర్చుకునేందుకు రుణ సాయం అందిస్తారు.

+ విశాఖపట్నం జిల్లాకు 1,39,501 గృహాలు మంజూరుచేయగా, వాటిలో 29,467 పూర్తయ్యాయని, ఇంకా 36,888 గృహాల పనులే ప్రారంభం కాలేదని నివేదికలో ప్రస్తావించారు. మిగిలిన గృహాలు వివిధ స్థాయిలో ఉన్నాయి.

+ ఉమ్మడి విశాఖ జిల్లాలో తొలి దశలో 2002 ఎకరాల్లో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేస్తున్నారని, రెండో దశకు మరో 4 వేల ఎకరాలు సేకరిస్తున్నట్టు పొందుపరిచారు.

+ గిరిజన సహకార సంస్థ అరకు కాఫీకి ఆర్గానిక్ సర్టిఫికేషన్ తీసుకువచ్చిందని, మరింత మంది రైతుల పంటకు ఆ గుర్తింపు కోసం ప్రయత్నిస్తున్నదని, ఈ ఆర్థిక సంవత్సరంలో రెండు వేల టన్నుల కాఫీ సేకరణ లక్ష్యంతో పనిచేస్తున్నదని పేర్కొంది. కొయ్యూరు మండలం డౌనూరులో రూ.3 కోట్లతో ఇంటిగ్రేటెడ్ కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించింది.

పన్ను వసూళ్లపై గ్రేటర్ దృష్టి

... 5వ పేజీ తరువాయి

నెలలో ఏకంగా రూ.62 కోట్లు వసూలవ్వడం విశేషం. ఆర్థిక సంవత్సరం ముగియనుండడంతో మార్చి నెలలో పన్ను వసూళ్లు మరింత ఎక్కువగా ఉంటాయని రెవెన్యూ విభాగం అధికారులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. ఈ ఏడాదికి సంబంధించిన పన్నుతోపాటు పెండింగ్‌లో ఉండిపోయిన ఆస్తి పన్ను బకాయిలు, నీటి పన్ను బకాయిలను కూడా రాబట్టడంపై రెవెన్యూ విభాగం అధికారులు దృష్టిసారించారు.

జీవీఎంసీ పరిధిలో 1,13,236 అసెస్‌మెంట్‌ల నుంచి రూ.56 కోట్ల మేర ఆస్తి పన్ను బకాయిలు రావలసి ఉన్నట్టు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. బకాయిలను తక్షణం చెల్లించాలని కోరుతూ జప్తు నోటీసులు జారీచేసే ప్రక్రియను ప్రారంభించారు. ఇప్పటివరకూ 90,346 అసెస్‌మెంట్‌లకు నోటీసులు జారీచేయగా, మిగిలిన వాటికి బుధవారం లోగా అందజేయాలని నిర్ణయించారు. నెలాఖరులోగా బకాయిలు చెల్లించకపోతే ఆయా ఆస్తులను జప్తు చేస్తామని నోటీసులో స్పష్టంచేస్తున్నారు.

మరోవైపు నీటి చార్జీలు (కొళాయి పన్ను) వసూలుచేసే బాధ్యత కూడా రెవెన్యూ విభాగమే చూస్తోంది. రెగ్యులర్‌తోపాటు బకాయిలను కూడా రాబట్టేందుకు చర్యలు ప్రారంభించింది. జీవీఎంసీ పరిధిలో 58,782 అసెస్‌మెంట్ల నుంచి రూ.39 కోట్లు వసూలుకావాల్సి ఉంది. ఆ మొత్తాన్ని కూడా నెలాఖరులోగా క్లియర్ చేసుకోవాలని, లేనిపక్షంలో కొళాయి కనెక్షన్ తొలగిస్తామని హెచ్చరిస్తూ నోటీసులు జారీచేస్తున్నారు. నీటి చార్జీలకు సంబంధించి బకాయి ఉన్నవారిలో 45,130 మందికి ఇప్పటికే నోటీసులు జారీచేయగా, మిగిలిన వారికి బుధవారం నాటికి పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. బకాయిలు వసూలైతే ఆస్తిపన్ను వసూళ్లలో జీవీఎంసీ ఈ ఏడాది సరికొత్త రికార్డు సృష్టించడం ఖాయమని అధికారులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

వాట్సాప్ ద్వారా టెన్త్ హాల్ టికెట్లు

... 5వ పేజీ తరువాయి

పుట్టిన తేదీ, మీడియం, ఫొటో, సంతకం, సబ్జెక్ట్ వంటివి పరిశీలించాలన్నారు. ఏమైనా పొరపాట్లు ఉంటే డైరెక్టర్, పరీక్షల విభాగానికి ఈ-మెయిల్ ద్వారా తెలియజేయాలని సూచించారు.

విద్యార్థులు కూడా తమ హాల్ టిక్కెట్లను మన మిత్ర వాట్సాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చునన్నారు. ఇందుకోసం వాట్సాప్ నంబర్ 95523 00009కు 'హాయ్' అని మెసేజ్ చేస్తే అందులో శాఖల వారీగా అందుబాటులో ఉండే సేవల గురించి సమాచారం అందుతుందన్నారు. అందులో విద్యాశాఖను ఎంచుకొని ఎస్సెస్సీ హాల్ టిక్కెట్స్‌ను ఎంచుకోవాలని డీఈవో తెలిపారు.

ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసులునాయుడు విజయంపై హర్షం

భీమునిపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసులునాయుడు విజయం సాధించడం పట్ల పీఆర్‌టీయూ, ఆపస్, ఎస్టీయూ, ఏపీటీఎఫ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడే గాదె గెలుపొందడం అభినందనీయమని నాయకులు ఆర్.అప్పలరాజు, ఎం.రమాదేవి, ఎస్.రాజేంద్రప్రసాద్, ఎస్.రమణారావు, పి.మురళీమోహనరావు, కె.సన్యాసినాయుడు, జి.పరదేశి, ఎస్.ఉదయ్‌కుమార్, ఆర్.అప్పారావు, ఐ.వెంకటరావు, ఎ.రామకృష్ణగూన ప్రభాకరరావు, భాస్కరరావు, వెంకటరమణ తదితరులు పేర్కొన్నారు. శ్రీనివాసులునాయుడు విజయానికి కృషి చేసిన వారికి పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు, నాగేశ్వరావులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ లైన్‌మన్ దివస్



విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నిరంతర విద్యుత్ సరఫరాకు సహకరించే లైన్‌మన్లను సత్కరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మార్చి 4న 'లైన్‌మన్ దివస్' గా నిర్వహించాలని, ఉత్తమ సేవలుందించిన లైన్‌మన్లను గుర్తించి సత్కరించాలని సూచించింది. ఈ మేరకు తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ప్రతి డివిజన్ నుంచి ఇద్దరు లైన్‌మన్లను గుర్తించి మంగళవారం సన్మానించడానికి ఏర్పాట్లు చేసింది. వినియోగదారులకు ఎటువంటి సమస్య లేకుండా నిరంతర విద్యుత్ అందించేందుకు కృషిచేస్తున్న తమను గుర్తించి, సన్మానించడం గొప్ప విషయమని లైన్‌మన్లు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. జిల్లాలో సుమారు 750 మంది లైన్‌మన్లు ఉండగా వారిలో డివిజన్‌కు ఇద్దరు చొప్పున మొత్తం ఆరుగురిని మంగళవారం సత్కరించనున్నారు.

కత్తితో దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

కూర్మన్నపాలెం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఒకరిపై కత్తితో దాడికి పాల్పడిన వ్యక్తిని సోమవారం దువ్వాడ పోలీసులు అరెస్టు చేశారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదగంట్యాడ మండలం అప్పికొండ సమీప చేపల పాలెంలో చీడిపల్లి పరదేశి కుటుంబంతో ఉంటున్నాడు. ఆదివారం రాత్రి పరదేశి ఇంటికి అదే గ్రామానికి చెందిన చోడిపల్లి ప్రసాద్ వచ్చి నీ పెద్ద కొడుకు శివాజీ ఎక్కడ ఉన్నాడు, చంపేస్తానని బెదిరించాడు. ఏం జరిగిందని పరదేశి అడగ్గా.. శివరాత్రి నాడు తన స్నేహితుడు కుమారుడు శివకుమార్‌ను శివాజీ కొట్టాడని ప్రసాద్ తెలిపాడు. శివాజీని చంపితే రూ.30 లక్షల సుపారీ ఇస్తానని శివకుమార్ చెప్పాడని, అందువల్ల శివాజీని హతమారుస్తానని ఇంట్లోకి ప్రవేశించబోయాడు. దీంతో చుట్టుపక్కల వారితో పాటు పరదేశి అడ్డుకోవడంతో ప్రసాద్ కత్తితో దాడి చేశాడు. పరదేశి ఎడమ చేతికి స్వల్ప గాయంకావడంతో భయభ్రాంతులకు గురైన ఆయన కోడలు డయల్ 100కు ఫోన్ చేసింది. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చోడిపల్లి ప్రసాద్‌ను అరెస్టు చేశారు. ప్రసాద్, శివకుమార్‌ల వల్ల తమ కుటుంబానికి హాని ఉందని, రక్షణ కల్పించాలని పరదేశి పోలీసులను కోరాడు. పరదేశిఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న శివకుమార్ కోసం గాలిస్తున్నారు.

సినిమా గైడ్

- **శబ్దం :** సంగం, శారద, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక),
- **మజాకా :** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం),
- **డ్రాగన్ :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి),
- **తండేల్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, నరసింహ (గోపాలపట్నం), అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం :** మెలోడీ, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడీ, సంగం, కామేశ్వరి, కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 33, టమాటా 14, వంకాయలు (తెలుపు)26, వంకాయలు (నలుపు) 15, బెండకాయలు 44, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 40, బీరకాయలు 60, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 12, క్యారెట్ 30 దొండకాయలు 36, బంగాళ దుంపలు 15, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది)52, బరబాటి 36, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 34, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 110, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 30, కీరదోస 28, కాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమ దుంపలు 38 చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 52, గోరు చిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్ కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 46, బొప్పాయి 42, జామ కాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	455
విజయనగరం	459
శ్రీకాకుళం	459

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	95
లైవ్ ధర	115
విత్ స్కిన్	200
స్కిన్‌లెస్	210

పరిమితికి మించి బడ్డీల ఏర్పాటు

- ఇరుకుగా ఎంవీపీ కాలనీ రహదారులు
- గత ప్రభుత్వ హయాంలో నేతల సహకారంతో యథేచ్ఛగా దుకాణాలు
- కూటమి ప్రభుత్వ కాలంలోనూ మారని తీరు
- చోద్యం చూస్తున్న గ్రేటర్ అధికారులు



ఏఎస్ రాజా మైదానానికి ఆనుకుని ఉన్న బడ్డీలు



టీటీడీ కూడలి- ఉషోదయజంక్షన్ మార్గంలో..

ఎంవీపీ కాలనీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ... విశాఖలోనే పక్కా ప్రణాళిక ప్రకారం నిర్మించిన కాలనీ అని పేరు. వసతులకు కరవు లేదు. చక్కని రోడ్లు, ఇరువైపులా చెట్లు, వృక్షాలతో అలరారుతుంది. విద్యా సంస్థలు, అనేక రకాల వాణిజ్య సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు.. ఇలా ఒకటేమిటి అన్ని విధాలా అభివృద్ధిన చెందిన ప్రాంతంగా చెప్పుకోవచ్చు. విద్యావంతులు, వ్యాపారవేత్తలు, ప్రభుత్వ ఉద్యోగులు, రాజకీయ నాయకులకు నిలయమైన ఈ కాలనీ భూముల ధరలు కూడా ఎక్కువే. ఓ విధంగా చెప్పాలంటే నగరంలోని అన్ని ప్రాంతాల కంటే పన్నెండు సెక్టర్లుగా ఉన్న ఎంవీపీ కాలనీకి ఓ ప్రత్యేకత ఉంది. సర్వతోముఖాభివృద్ధి గాంచిన కాలనీగా చెపుతారు. నగరానికి ఎంవీపీ కాలనీ ఐకాన్. అందమైన ఈ కాలనీలో ఒక భూతం పెనుభూతమై కూర్చుంది. అవే బడ్డీలు. ఇందుగలవవు.. అందులేవని అన్నట్టుగా ఎంవీపీ కాలనీలోని ఏ కూడలి చూసినా బడ్డీల మయమే. గత ప్రభుత్వ హయంలో ఇష్టానుసారం బడ్డీలు పెట్టించారు. వైసీపీ నాయకులు భారీగా డబ్బులు వసూలు చేశారు. డబ్బులిస్తే ఎక్కడ కావాలంటే అక్కడ బడ్డీ పెట్టేసుకోవడానికి రాజకీయ నాయకులు అనుమతిలిస్తే, అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూస్తుండిపోయింది. మరి ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది కదా అంటే.. ఇప్పుడూ అంతే. కాకపోతే డబ్బుల బెడద లేదు. ఇంతకు ముందులా డబ్బులు వసూళ్ల పర్వం లేకపోవడం సంతోషించాల్సిన అంశమే అయినా, నగర అందాలకు గండి కొట్టేలా ఏ మూల చూసినా బడ్డీల మయమే. ఎక్కడ పడితే అక్కడ. ఫుట్‌పాత్‌లు, బస్ స్టాపులన్న మాట లేదు. కొన్ని చోట్ల రోడ్డు పక్కన బడ్డీలు తప్ప ఇంకేమీ కనిపించని పరిస్థితి. మరి జీవీఎంసీ యంత్రాంగం ఏం చేస్తుందనే ప్రశ్న సహజంగానే ఉత్పన్నమవుతుంది. షరా మామూలే! రాజకీయ నాయకుల సిఫార్సులకు 'జీ హుజీర్' అంటూ తలాడించేస్తుండడంతో, 'యథా రాజా తథా ప్రజా..' అన్నట్టు బడ్డీల ఏర్పాటు ఎక్కడికక్కడ నిరాటంకంగా సాగుతోంది. టీటీడీ కూడలి, ఉషోదయా కూడలి, ఎంవీపీ సర్కిల్ నుంచి ఏఎస్ రాజా కూడలి వరకూ, అలాగే టాస్క్ ఫోర్స్ కూడలి నుంచి ఎంవీపీ డబుల్ రోడ్డు, మరో వైపు స్పోర్ట్స్ ఎరీనా వైపు భారీ సంఖ్యలో బడ్డీలు విస్తరించి ఉన్నాయి.

ఇదో తరహా వ్యాపారం

బడ్డీల్లో వ్యాపారం చేయడం ఒక ఎత్తైతే, ఆ బడ్డీలతోనే వ్యాపారం చేయడం మరో గమ్మత్తు. రాజకీయంగా కాస్త పరపతి ఉన్నవారు వివిధ ప్రాంతాల్లో బడ్డీలు ఏర్పాటు చేసుకున్నారు. ఆ బడ్డీల్లో వీరు వ్యాపారం చేయరు. బడ్డీలను అద్దెకివ్వడమే వీరి వ్యాపారం. ఆయా కూడలి, అక్కడ జరిగే వ్యాపారాన్ని బట్టీ అద్దెలు ఉంటాయి. వీటి ధర నెలకు రూ. 5 వేల నుంచి రూ 15 వేల వరకూ ఉంటోంది. కొందరు వ్యక్తులు నాలుగైదు బడ్డీలను ఏర్పాటు చేసుకుని నెలకు రూ. 25 వేల నుంచి రూ 50 వేల వరకూ సంపాదిస్తున్నారు. కొన్ని చోట్ల చాలా బడ్డీలు ఖాళీగా ఉంటాయి. అంటే ఆ బడ్డీల్లో ఉన్న వారు ఖాళీ చేసేయడం, కొత్తవారు అద్దెకు రాకపోవడం వల్ల అవి ఖాళీగా ఉంటాయన్న మాట. మొత్తం మీద ఎంవీపీ అందాలకు ఈ బడ్డీలు గండి కొడుతున్నా, ఎవరూ పట్టించుకోవడం లేదు. ఓ వైపు స్మార్ట్ సిటీ అంటూ రూ.కోట్ల నిధులు మంజూరు చేసి, కూడళ్ల అభివృద్ధి చేస్తున్నా, మరో వైపు అదే కూడళ్లలో ఓ పద్ధతి లేకుండా బడ్డీలమీద బడ్డీలు వరుసగా ఉంటున్నాయి.

దుకాణాలను జీవీఎంసీ ఏర్పాటు చేస్తే మేలు

ఈ సమస్య పరిష్కారానికి ఎంవీపీలోనే నాలుగైదు కూడళ్లను గుర్తించి, బడ్డీల స్థానంలో చిన్నపాటి దుకాణాలను జీవీఎంసీనే నిర్మిస్తే బాగుంటుందన్న ప్రతిపాదన ఈ ప్రాంతీయుల నుంచి వినిపిస్తోంది. ఒక పద్ధతి ప్రకారం దుకాణాలు నిర్మించడం వల్ల నగరానికి అందంగానూ ఉంటుందని అంటున్నారు, జీవీఎంసీకి ఆదాయమూ వస్తుంది. ముఖ్యంగా బడ్డీల్లో జరిగే వ్యాపారం చాలా చిన్నదే ఉంటుంది. కాబట్టీ చిన్న పరిమాణంలో దుకాణాలను నిర్మించడం వల్ల ఉపయోగం ఉంటుందని పలువురు అంటున్నారు.

జీవీఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు దీనిపై దృష్టి సారించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కుట్టా కార్తీక్

చలివేంద్రం ప్రారంభం

కంచరపాలెం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 54వ వార్డు పరిధి ఐటీఐ జంక్షన్ వద్ద పైడిమాంబ ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రాన్ని టీడీపీ నాయకుడు కుట్టా కార్తీక్ ప్రారంభించారు. అనంతరం పాదచారులు, వాహనదారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో స్టాండ్ ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

వైసీపీ అధినేతకు నిజాయితీ ఉంటే అసెంబ్లీకి రావాలి: ఎమ్మెల్యే వంశీకృష్ణ

అమరావతి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేతకు నిజాయితీ ఉంటే ప్రజా సమస్యలపై చర్చించడానికి అసెంబ్లీకి రావాలని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. వైసీపీకి 11 సీట్లు ఇచ్చింది ఇంట్లో విశ్రాంతి తీసుకోవడానికో, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడానికో కాదన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో సోమవారం ఆయన మాట్లాడుతూ, 'ప్రతిపక్ష హోదా ఇచ్చేది ప్రజలేనని, అధికార పార్టీ నాయకులు కాదనే విషయాన్ని వైసీపీ నేతలు గమనించాలన్నారు. రుషికొండ బీచ్‌కు బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్‌పై వైసీపీ నేతలు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

6 నుంచి యల్లమాంబ జాతర మహోత్సవాలు



యల్లమాంబ ఆలయం

వెంకోజీపాలెం, మార్చి (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 15 వార్డులోని పాతవెంకోజీపాలెం యల్లమాంబ నగర్‌లో వేంచేసి ఉన్న యల్లమాంబ అమ్మవారి వార్షిక ఉత్సవాలు ఈ నెల 6వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు కాలనీ సేవా కమిటీ అధ్యక్షుడు వారణాసి విశాలాక్షి, కార్యదర్శి కాళ్ల కుమార్ తెలిపారు. 6న జాతర తోలేళ్లు, 7న అమ్మవారి జాతర ముగింపు మహోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా తెల్లవారు జాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయని చెప్పారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమలను అందజేయాలని కోరారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధులలో ఊరేగింపు, మేళతాళాలతో సేవా గరిడి, డప్పులు, కోలాటం, గ్రామ దేవతల ప్రోగ్రా మ్, తీన్‌మాన్, మందుగుండు సామగ్రి వాయిద్య బృందాలతో అమ్మవారి ఊరేగింపు ఉంటుందన్నారు.

నేడు కృష్ణా కళాశాలలో జాబ్‌మేళా

మద్దిలపాలెం, మార్చి3 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ వీఎస్ కృష్ణా డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు తెలిపారు. హెటిరో డ్రగ్స్, యోకోహమ టైర్స్ సంస్థలు ఉద్యోగాల భర్తీకి ఈ మేళా చేపట్టామన్నారు. హెటిరో డ్రగ్స్‌లో 70 జూనియర్ కెమిస్ట్ ఉద్యోగాలు, 25 ఐటీఐ ఫిట్టర్ అప్రెంటిషిప్‌కు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని చెప్పారు.

కనుమరుగవుతున్న మహిళా చట్టాలు

ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల



మాట్లాడుతున్న అత్తిలి విమల

పెందుర్తి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మహిళల చట్టాలు నిర్వీర్యంతో హక్కులు, భద్రత కనుమరగవుతున్నాయని ఏపీ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల అన్నారు. మహిళా సమాఖ్య పెందుర్తి ఏరియా సమితి ఆధ్వర్యంలో సోమవారం సుజాతనగర్ నుంచి గిరిప్రసాద్ నగర్ వరకు మహిళా దినోత్సవ వారోత్సవాల ర్యాలీని నిర్వహించారు. ఈ సంద ర్భంగా మహిళలపై హింసను అరికట్టాలని, చట్టసభలో 33 శాతం రిజర్వేషన్‌ను అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. అనంతరం విమల సమాఖ్య పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఉద్యమాలతోనే మహిళలు హక్కులను సాధించుకోవాలన్నారు. సమాఖ్య జిల్లా కార్య దర్శి ఎంఏ బేగం మాట్లాడుతూ బీజేపీ కేంద్రపాలిత రాష్ట్రాల్లో మహిళాహింస అధికంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యురాలు పుష్ప, పెందుర్తి ఏరియా ప్రతినిధులు ఎ.అన్నపూర్ణ, ఎన్. అరుణ, పావని, లక్ష్మి,విజయ పాల్గొన్నారు.

భారీ లోడు.. నిబంధనలు పట్టించుకోరు!



భారీ లోడుతో వాహనం నడుపుతూ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతున్న డ్రైవర్

డ్రైవింగ్ చేస్తూ ఫోన్ మాట్లాడకూడదన్న నిబంధనను వాహన చోదకులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. భారీ లోడుతో మినీ ట్రాన్స్‌పోర్ట్ వాహనం నడుపుతున్న ఓ చోదకుడు ఇలా నిర్లక్ష్యంగా సెల్ ఫోన్ మాట్లాడుతూ సోమవారం పురుషోత్తపురం వద్ద కనిపించాడు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

ఏయూ ఇంటర్ కాలేజియట్ కమ్ యూనివర్సిటీ జట్ల ఎంపిక



పోటీలను ప్రారంభిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

వెంకోజీపాలెం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఏయూ ఇంటర్ కాలిజియట్ కమ్ యూనివర్సిటీ జట్టు ఎంపికలు సోమవారం ఏయూ టెన్నిస్ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ ముఖ్యఅతిధిగా పాల్గొని పోటీలను ప్రారంభించారు.

అనంతరం పోటీలు పాల్గొంటున్న క్రీడాకారులను అభినందించారు. యూనివర్సిటీ తరఫున క్రీడల్లో పాల్గొని ప్రతిభ సాధించి వర్సిటీకీ పేరు తేవాలన్నారు. ఈ సందర్భంగా ఏయూ ఇంటర్ కాలిజియట్ జట్లు సమతా కళాశాల, ఏయూ ఆర్ట్స్, డాక్టర్ వీఎస్ కృష్ణా డిగ్రీ, పీజీ కళాశాల, ఏవీఎన్ కళాశాల, గాయత్రి కళాశాల తదితర బాల్ బ్యాడ్మింటన్ జట్లు పరియ కార్యక్రమంలో పాల్గొన్నాయి. అలాగే మహిళల ఇంటర్ కాలిజియట్ జట్లు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు, ఏయూ వ్యాయామ విద్యా విభాగాధిపతి ఎ. పల్లవి, ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యూకేషన్ ఎస్.విజయమోహన్, ఐపీ స్పోర్ట్స్ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ వీఎస్ కృష్ణా డిగ్రీ, పీజీ కళాశాల లెక్చరర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ కిరణ్మయి, తదితర కళాశాల పీడీలు, క్రీడాకారులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఏయూ వీసీని కలిసిన కృష్ణా కళాశాల సిబ్బంది



వీసీ రాజశేఖర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలుపుతున్న కృష్ణా కళాశాల అధ్యాపకులు, సిబ్బంది

మద్దిలపాలెం, మార్చి3 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టిన జి.పి.రాజశేఖర్‌ను మంగళవారం డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు మర్యాదపూర్వ కంగా కలిశారు. వీసీకి పుష్పగుచ్ఛం అంద జేసి శుభకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విజయబాబుతో కళాశాల నిర్వహణ ఇతరత్రా అంశాల గురించి వీసీ అడిగి తెలుసుకున్నారు. నాక్ గుర్తింపుతో పటిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కళాశాలను మరింత ప్రగతిపథంలో నడిపించాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పి.జయ, డి.శ్రావణ్‌కుమార్, కె.రవిబాబు, పి.ఉమామహేశ్వరరావు, రాజేశ్వరరావు, పి.గోపాల్ నాయుడు, జి.లక్ష్మణరావు, జీవీ ప్రతాప్ పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన కల్పిస్తూ బైక్ ర్యాలీ



మహిళా సాధికారతపై అవగాహన కల్పిస్తూ బైక్ ర్యాలీలో పాల్గొన్న సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది

ఎంవీపీ కాలనీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో సోమవారం ఎంవీపీ కాలనీ సంక్షేమ భవన్ వద్ద బైక్ ర్యాలీ నిర్వహించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆర్జేడీ చిన్మయిదేవి, ప్రాజెక్టు డైరెక్టర్ జయదేవి ర్యాలీ ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా బాలికల హక్కులు, లింగ సమానత్వం, సాధికారత అనే అంశాలపై అన్ని ఐసీడీఎస్‌ల పరిధిలో వారం రోజుల పాటు మహిళా చైతన్యం కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్టు అధికారులు పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కె.రామారావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ మల్లీశ్వరి, ఎస్ఐ రూపవతి, నోడల్ అధికారులు శారదా, శ్రీకళ, ఏసీడీపీవో శ్రీలత, ఐసీపీఎస్, శిశుగృహ, వన్‌స్టాప్ సెంటర్, గృహ హింస సెల్‌కు చెందిన ఉద్యోగులు బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.

'గాదె' గెలుపులో పీఆర్టీయూ నేతల సంబరాలు



ఏయూ ఇంజినీరింగ్ కళాశాల వద్ద సంబరాలు జరుపుకుంటున్న పీఆర్టీయూ నాయకులు

మద్దిలపాలెం, మార్చి3(ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గాదె శ్రీనివాసులు విజయం సాధించడంతో ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్టీయూ)నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల వద్ద సోమవారం పీఆర్టీయూ నాయకులు, కార్యకర్తలు విజయోత్సవంతో ఉప్పొంగిపోయారు. ఒకరొకరు మిఠాయిలు తినిపించుకుని సందడి చేశారు.

ఈ సందర్భంగా పీఆర్‌టీయూ ఉమ్మడి జిల్లా కన్వీనర్ గోపినాథ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో గాదె శ్రీనివాసులు దిట్టని అభివర్ణించారు. రెండు దఫాలు ఎమ్మెల్సీగా ఉపాధ్యాయుల పక్షాన నిలబడి ఎంతోమందికి అండగా నిలిచారన్నారు. అందుకే ఈ ఎన్నికల్లో గాదె శ్రీనివాసులకే ఉపాధ్యాయులు పట్టం కట్టారన్నారు. ఆయనకు ఓటేసి గెలిపించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు పైడిరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిలపాలెంలో 'గాదె' మద్దతుదారుల ఆందోళన



ఆందోళన చేస్తున్న గాదె శ్రీనివాసులునాయుడు మద్దతుదారులు

విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) :ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విజేతగా గాదె శ్రీనివాసులనాయుడు పేరు అధికారికంగా ప్రకటించడంలో జాప్యం చేస్తున్నారని పేర్కొంటూ ఆయన మద్దతుదారులు సోమవారం రాత్రి మద్దిలపాలెం జంక్షన్‌లో ఆందోళన చేశారు. అయితే తూర్పు ఏసీపీ లక్ష్మణమూర్తి వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని వారికి నచ్చచెప్పడంతో ఆందోళన విరమించారు.

జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్

వెంకోజీపాలెం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం, సెంటర్ ఫర్ సోషల్ ఇంక్లూజన్ సంయుక్తంగా ఏప్రిల్ 3, 4 తేదీల్లో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. "ఆర్థిక సమ్మిళత - సామాజిక సమానత్వం: 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ ఒక రోడ్ మ్యాప్" అనే అంశంపై జాతీయ సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఎన్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.నరసింహరావు, సదస్సు కన్వీనర్ జాలాది రవి, సదస్సు సహ కన్వీనర్ డాక్టర్ పి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సదస్సు నిర్వాహకులను వీసీ అభినందించారు. వర్తమాన ప్రాధాన్యం కలిగిన అంశంపై సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు.

భక్తిశ్రద్ధలతో ముత్యాలమ్మ పుట్టమన్ను ఊరేగింపు



ముత్యాలమ్మ పుట్టమన్ను తీసుకువెళ్తున్న నక్కవానిపాలెం గ్రామస్థులు

సీతమ్మధార, మార్చి 3, (ఆంధ్రజ్యోతి): నక్కవానిపాలెం గ్రామ దేవత ముత్యాలమ్మ, ఏడుగుళ్ల అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ముత్యాలమ్మవారి దేవర పుట్టమన్ను పూజ లు జరిగాయి. రామాలయం పెద్దింటి వద్ద నుంచి పుట్టమన్నును మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయం వద్ద ఉంచి పూజలు చేశారు. అనంతరం అక్కడి నుంచి జంగిడిలో అమ్మవారి పూజా సామాగ్రితో పెద్దింటికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలను పరిశీలించిన జేసీ


పరీక్షల తీరును పరిశీలిస్తున్న జేసీ మయూర్‌అశోక్

డాబాగార్డెన్స్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షల నిర్వహణను సోమవారం జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ పరిశీలించారు. పాత జైల్‌రోడ్డులోని విశాఖ ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు.

తెలుగు సామర్థ్యం పెరిగితేనే మనోవికాసం: ఎంఈవో


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో రామారావు

సీతంపేట, మార్చి 3, (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 5వ వార్డు సీతంపేట మధురానగర్‌లో గల జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో డి.రామారావు సోమవారం తనిఖీ చేశారు. 3, 4, 5 తరగతుల్లో విద్యార్థుల తెలుగు సామర్థ్యాలను పరిశీలించి వారి స్థాయిలను గుర్తించారు. తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడి తెలుగు పాఠ్యాంశాలు, భాషపై పట్టు పెంచుకోవాలన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

12 కిలోల గంజాయి స్వాధీనం

విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని రైల్వే పోలీసులు సోమవారం పట్టుకున్నారు. అతని నుంచి 12 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ ఎస్ఐ ఎస్.రామారావు, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ జె.టి.నాయుడు తమ సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఒడిశాకు చెందిన రింకీ మాలి ముంబైకు గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డాడని, అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

రైల్వే రిజర్వేషన్ కార్యాలయంలో డీఆర్ఎం తనిఖీలు


రిజర్వేషన్ కార్యాలయం వద్ద తనిఖీ చేస్తున్న డీఆర్ఎం


రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంలను పరిశీలిస్తున్న డీఆర్ఎం లలిత్ బోహ్రా

విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్ సమీపంలోని కంప్యూటర్ రిజర్వేషన్ కార్యాలయంలో డీఆర్ఎం లలిత్ బోహ్రా సోమవారం తనిఖీలు చేశారు. రిజర్వేషన్ కార్యాలయంలో టికెట్ జారీ విధానంలో పాటిస్తున్న నిబంధనలు, డిజిటల్ చెల్లింపు విధానాల నిర్వహణను పరిశీలించారు. అలాగే కార్యాలయం వద్ద పార్కింగ్ ఏరియాను పరిశీలించి పలు సూచనలు చేశారు. అక్కడి నుంచి స్టేషన్‌కు చేరుకుని ప్లాట్‌ఫామ్‌లపై అమ్మకాలు చేపట్టే స్టాల్స్‌ను పరిశీలించారు. స్టాల్స్ నిర్వాహకులు ప్రయాణికులకు అందించే నాణ్యత, ధరలపై కమర్షియల్ అధికారులతో చర్చించారు. అనంతరం పార్శిల్ కార్యాలయం, న్యూ కోచింగ్ కాంప్లెక్సుల్లో పర్యటించి విధుల నిర్వహణ, ఇతరత్రా అంశాలను పరిశీలించారు.

కిరండూల్ రైలు దంతెవాడ వరకే

విశాఖపట్నం: కేకే లైనులో ఆధునికీకరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో విశాఖ, కిరండూల్ మధ్య నడుస్తున్న రైళ్ల సర్వీసులు ఈ నెల ఏడు నుంచి 16వ తేదీ వరకు విశాఖ-దంతెవాడ మధ్య రాకపోకలు సాగించేలా గమ్యాలను తాత్కాలికంగా కుదించామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. దీంతో విశాఖ-కిరండూల్ పాసింజర్ (58501), విశాఖ-కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్ (18515) రైళ్లు ఈ నెల ఏడు నుంచి 15వ తేదీ వరకు విశాఖ నుంచి దంతెవాడ వరకు, తిరుగు ప్రయాణంలోని కిరండూల్-విశాఖ పాసింజర్ (58502), కిరండూల్-విశాఖ నైట్ ఎక్స్‌ప్రెస్ (18516) రైళ్లు ఈ నెల ఎనిమిది నుంచి 16వ తేదీ వరకు దంతెవాడ నుంచి విశాఖకు నడుస్తాయని పేర్కొన్నారు. దంతెవాడ, కిరండూల్ మధ్య రాకపోకలను తాత్కాలికంగా రద్దు చేశామన్నారు.

'కార్మిక సమస్యలపై పోరాటానికి సిద్ధంకండి'

అల్లిపురం, మార్చి3 (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో పనిచేస్తున్న అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని జిల్లా సమితి ప్రధాన కార్యదర్శి జీఎస్‌జే అచ్యుతరావు పిలుపునిచ్చారు. అల్లిపురం నీలంరాజశేఖర్‌రెడ్డి భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్, జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం, ముఠా కార్మిక సంఘం,సివిల్ సప్లైస్ కార్మిక సంఘం, కాంట్రాక్టు వర్కర్స్, వీధి విక్రయదారులు, చిరువ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం ఎదుట ధర్నా చేస్తామన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు మన్మథరావు, వెంకటరావు, రెహమాన్, గోవింద్, సత్యాంజనేయ, తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ ప్రిన్సిపాల్‌కు అభినందనలు


ప్రిన్సిపాల్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డా.ఫణీంద్ర

మహారాణిపేట, మార్చి3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులైన డాక్టర్ కేవీఎస్ఎన్ సంధ్యాదేవిని ప్రముఖ పల్మనాలజీ వైద్యుడు, ఐఎంఏ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ కేతా ఫణీంద్ర సోమవారం కలిశారు. సమర్థ వ్యక్తిని ప్రిన్సిపాల్‌గా ఎంపిక చేశారన్నారు. అనంతరం ఆమెకు పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. వైద్య కళాశాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

శిష్టకరణ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గం


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

డాబాగార్డెన్స్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): శిష్ట కరణ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గం ఎన్నికలను డాబాగార్డెన్స్ ప్రేమ సమాజంలో సోమవారం నిర్వహించారు. ఎన్నికల అధికారి పి.రామచంద్రరావు, కమిటీ సభ్యుడు ఎన్‌వీఎస్ శర్మ, ఎన్.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లాల వారీగా ఓటు హక్కును కల్పించి నూతన అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అక్కుమహంతి నాగేశ్వరరావు (రాజా), ప్రధాన కార్యదర్శిగా ఎం.గౌరీశంకర్, కోశాధికారిగా బి.రాధాకుమారి, కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం సభ్యులకు ధ్రువీకరణ పత్రాలను అందించి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

శీతల పానీయాల కంపెనీ సీజ్

జ్ఞానాపురం, మార్చి3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-5 38వార్డులో ఒక శీతల పానీయాల కంపెనీకి జీవీఎంసీ అధికారులు సీజ్ చేశారు. ఆస్తిపనున్న బకాయి రూ.12.31 లక్షలు చెల్లించకపోవడంతో కమిషనర్ ఆదేశాల మేరకు జోన్ అసిస్టెంట్ కమిషనర్ బాబూరావు, ఆర్ఐ శ్రీనివాస్, అడ్మిన్‌ల సమక్షంలో సోమవారం కంపెనీకి తాళాలు వేశారు.

రేపటి నుంచి రేణుక ఎల్లమ్మ జాతర


కరపత్రం ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

అల్లిపురం, మార్చి3 (ఆంధ్రజ్యోతి):అచ్చియ్యమ్మపేట రేణుక యల్లమ్మ 25వ వార్షిక జాతర మహోత్సవాలు ఈనెల ఐదు నుంచి ఏడో తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఆలయ గౌరవాధ్యక్షుడు పీల వెంకట అప్పలనాయుడు, అధ్యక్షుడు కర్రి నీలకంఠం తెలిపారు. ఈ మేరకు సోమవారంజాతర కరపత్రాన్ని కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఐదున గౌరవాధ్యక్షుడికి ఇంటి నుంచి అమ్మవారి అభరణాల ఊరేగింపు, 6న తొలేళ్లు, ఏడో తేదీన ప్రధాన ఉత్సవం నిర్వహిస్తామన్నారు. ఆ రోజు వంద కలశాలతో మహిళలు పోలేరమ్మ సతకం పట్టు నుంచి తిరువీధి నిర్వహించి అమ్మవారికి జలాభిషేకం చేస్తారన్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించామని, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో వాసుపల్లి నారాయణ, పంపాన గణేష్, బొడ్డేటి ప్రసాద్, గనగళ్ల సత్య కామేశ్వర శర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు పైడిమాంబ ప్రధాన పండుగ

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు తిక్కవానిపాలెం గ్రామంలో కొలువై ఉన్న పైడిమాంబ అమ్మవారి ప్రధాన పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ అధ్యక్షకార్యదర్శి ఉమ్మిడి వాసుదేవరావు, పట్టిమ రాజు తెలిపారు. అమ్మవారి ప్రధాన పండుగ సందర్భంగా గ్రామంలో ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కాగా సోమవారం అమ్మవారి తొలేళ్ల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలేళ్ల ఉత్సవం సందర్భంగా భక్తులు అమ్మవారి ప్రతిమలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

రాష్ట్ర స్థాయి సీనియర్ హాకీ టోర్నీకి విశాఖ జట్టు

విశాఖపట్నం, స్పోర్ట్సు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల హాకీ చాంపియన్ షిప్ టోర్నీలో పాల్గొనే విశాఖ జట్టు సభ్యుల జాబితాను సోమవారం ప్రకటించారు. ఈ నెల ఆరో తేదీ నుంచి గుంటూరులో జరగనున్న ఈ టోర్నీలో 18 మంది ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా హాకీ సంఘం కార్యదర్శి కేవీ అంజనేయరావు తెలిపారు. జట్టులో రాజప్రభాకర్ పవన్, బోని ప్రశాంత్, సీహెచ్‌వీ మూర్తి, వై.భార్గవ్, డి.ప్రసాద్, బి.వెంకటరమణ, కె.వాసుదేవ, శ్రీరామ్ రాజేశ్ శ్యామ్‌వర్మ, ఎన్.రాజేశ్వరరావు, డి.ప్రవీణ్, ఎన్.లోకేశ్‌రాజు, ఎస్.మోహన్, హెచ్.ఋషి, పి.పౌల్, సంజయ్‌కుమార్, ఎస్.నూకరాజు, షేక్ సాదిఖ్, డి.పవన్ ఉంటారు. ఈ జట్టుకు కోచ్‌గా జి.రాంజీ, మేనేజర్‌గా డి.లోకేశ్ వ్యవహరిస్తారని ఆయన వివరించారు.

తండ్రి చెంతకు చేరిన కుమారుడు


అరుణవ్ దేవ్‌ను తండ్రికి అప్పగిస్తున్న శ్రద్ధ ఫౌండేషన్ సభ్యులు

అక్కయ్యపాలెం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వచ్చేసిన ఓ వ్యక్తిని తిరిగి తండ్రి వద్దకు చేర్చినట్టు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. త్రిపుర రాష్ట్రంలోని నార్త్ త్రిపుర జిల్లా కుమార్ ఘాట్‌కు చెందిన అరుణవ్ దేవ్(30) తల్లి అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆయన తండ్రి రెండో పెళ్లి చేసుకోవాల్సి వచ్చింది. ఈ విషయం నచ్చని అరుణవ్ దేవ్ తండ్రితో విభేదించి ఇంటి నుంచి బయటకు వచ్చేశాడు. అతనిని ఏయూటీడీ సిబ్బంది గతేడాది నవంబరు లో పట్టుకుని ఇక్కడి షెల్టర్‌లో ఆశ్రయం కల్పించి చికిత్స అందజేశారు. కొన్నాళ్లకు అతను సాధారణ స్థితికి చేరాడు. దీంతో అతనిని విశాఖ నుంచి శ్రద్ధా ఫౌండేషన్ సభ్యులు త్రిపుర తీసుకు వెళ్లి తండ్రికి అప్పగించారు. 18 నెలల తరువాత కుమారుడిని చూసిన తండ్రి ఆనందం వ్యక్తం చేశారు.

పన్ను వసూళ్లపై గ్రేటర్ దృష్టి

... 5వ పేజీ తరువాయి

నెలలో ఏకంగా రూ.62 కోట్లు వసూలవ్వడం విశేషం. ఆర్థిక సంవత్సరం ముగియనుండడంతో మార్చి నెలలో పన్ను వసూళ్లు మరింత ఎక్కువగా ఉంటాయని రెవెన్యూ విభాగం అధికారులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. ఈ ఏడాదికి సంబంధించిన పన్నుతోపాటు పెండింగ్‌లో ఉండిపోయిన ఆస్తి పన్ను బకాయిలు, నీటి పన్ను బకాయిలను కూడా రాబట్టడంపై రెవెన్యూ విభాగం అధికారులు దృష్టిసారించారు. జీవీఎంసీ పరిధిలో 1,13,236 అసెస్‌మెంట్‌ల నుంచి రూ.56 కోట్ల మేర ఆస్తి పన్ను బకాయిలు రావలసి ఉన్నట్టు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. బకాయిలను తక్షణం చెల్లించాలని కోరుతూ జప్తు నోటీసులు జారీచేసే ప్రక్రియను ప్రారంభించారు. ఇప్పటివరకూ 90,346 అసెస్‌మెంట్‌లకు నోటీసులు జారీచేయగా, మిగిలిన వాటికి బుధవారం లోగా అందజేయాలని నిర్ణయించారు. నెలాఖరులోగా బకాయిలు చెల్లించకపోతే ఆయా ఆస్తులను జప్తు చేస్తామని నోటీసులో స్పష్టంచేస్తున్నారు. మరోవైపు నీటి చార్జీలు (కొళాయి పన్ను) వసూలుచేసే బాధ్యత కూడా రెవెన్యూ విభాగమే చూస్తోంది. రెగ్యులర్‌తోపాటు బకాయిలను కూడా రాబట్టేందుకు చర్యలు ప్రారంభించింది. జీవీఎంసీ పరిధిలో 58,782 అసెస్‌మెంట్ల నుంచిరూ.39 కోట్లు వసూలుకావాల్సి ఉంది. ఆ మొత్తాన్ని కూడా నెలాఖరులోగా క్లియర్ చేసుకోవాలని, లేనిపక్షంలో కొళాయి కనెక్షన్ తొలగిస్తామని హెచ్చరిస్తూ నోటీసులు జారీచేస్తున్నారు. నీటి చార్జీలకు సంబంధించి బకాయి ఉన్నవారిలో 45,130 మందికి ఇప్పటికే నోటీసులు జారీచేయగా, మిగిలిన వారికి బుధవారం నాటికి పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. బకాయిలు వసూలైతే ఆస్తిపన్ను వసూళ్లలో జీవీఎంసీ ఈ ఏడాది సరికొత్త రికార్డు సృష్టించడం ఖాయమని అధికారులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

ప్రతిరోజూ తరగతులకు హాజరుకావాలి

... 5వ పేజీ తరువాయి

విభాగంలో ఉన్న సమస్యలను పరిష్కరించి, వసతులు మెరుగుపరిచి అభివృద్ధి దిశగా నడిపించే ప్రయత్నం జరుగుతుందన్నారు. త్వరలో శతాబ్ది ఉత్సవాలు జరగనున్నాయని, ఈ ప్రక్రియలో ప్రతి విభాగం భాగస్వామ్యం కావాలన్నారు. అందరి సహకారంతో కార్యక్రమాలను సమర్థంగా నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎన్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇ.ఎన్. ధనుంజయరావు, ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ ఎ.నరసింహరావు, జి.శశిభూషణరావు, జి.గిరిజాశంకర్, ఎంవీఆర్ రాజు, కె.సీతామాణిక్యం, డి.నాగరాజకుమారి, ఆర్.పద్మశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

'నజీర్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి'

అక్కయ్యపాలెం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ నజీర్‌కు ఎమ్మెల్సీగా అవకాశమివ్వాలని మజీద్ కమిటీ అధ్యక్షుడు నవాబ్‌బాయి, ఇషాక్ కూటమి ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు చిన్నూరులోని మసీద్ దగ్గర సోమవారం నిరసన తెలిపారు. ముస్లింలందరికీ న్యాయం జరగాలంటే నజీర్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలన్నారు. ఏ ప్రభుత్వమూ ముస్లింలకు ప్రత్యేకస్థానం ఇవ్వడం లేదన్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా నజీర్‌కు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి ముస్లింల ఆకాంక్ష తీర్చాలన్నారు. మైనారిటీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేశ్ న్యాయం చేయాలని కోరారు.

ఎమ్మెల్సీ గద్దెపై గాదె

... 5వ పేజీ తరువాయి


ఓట్ల లెక్కింపును పర్యవేక్షిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

కేటాయించిన సిబ్బంది లెక్కించారు. మొత్తం 20,794 ఓట్లు పోల్ కాగా, 20,135 ఓట్లు చెల్లినవిగా, 659 ఓట్లు చెల్లనవిగా గుర్తించారు. మధ్యాహ్నం రెండు గంటల సమయానికి తొలి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు పూర్తయ్యింది. మొదటి ప్రాధాన్య ఓట్లలో గాదె శ్రీనివాసులునాయుడుకు 7,210, పాకలపాటి రఘువర్మకు 6,845, కోరెడ్ల విజయగౌరికి 5,804 రాగా, మిగిలిన ఏడుగురు అభ్యర్థులకు వంద కంటే తక్కువ వచ్చాయి. విజేతను ప్రకటించాలంటే పోలైన ఓట్లలో 50 శాతం కంటే అదనంగా ఒక్క ఓటైనా రావాలి. అంటే చెల్లిన ఓట్లు 20,1345లో 10,067 ప్లస్ ఒకటి..10,068 ఓట్లను సాధించాలి. అయితే, మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు పూర్తయ్యేసరికి పోటీలో ఉన్న అభ్యర్థులెవరూ మ్యాజిక్ ఫిగర్ దక్కించుకోకపోవడంతో రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపు అనివార్యమైంది.

రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపుతో విజయం..

మధ్యాహ్నం భోజన విరామం తరువాత రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపు ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. మొదట తక్కువ ఓట్లు లభించిన అభ్యర్థుల రెండో ప్రాధాన్య ఓట్లను లెక్కిస్తూ ఎలిమినేషన్ ప్రక్రియను చేపట్టారు. రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపులో రెండో రౌండ్‌లో పెదపెంకి శివ ప్రసాద్, మూడో రౌండ్‌లో ఎస్ఎస్ పద్మావతి, నాలుగు రౌండ్‌లో రాధాకృష్ణ, ఐదో రౌండ్‌లో సత్యనారాయణ, ఆరో రౌండ్‌లో శ్రీనివాసరావు, ఏడో రౌండ్‌లో దుర్గా ప్రసాద్, ఎనిమిదో రౌండ్‌లో సూర్యప్రకాష్‌ను ఎలిమినేట్ చేశారు. ఎనిమిది రౌండ్లు పూర్తయ్యేసరికి గాదె శ్రీనివాసులునాయుడుకు 7,248 ఓట్లు, పాకలపాటి రఘువర్మకు 6,881 ఓట్లు, కోరెడ్ల విజయగౌరికి 5,872 ఓట్లు లభించాయి. అప్పటికి కూడా ఎవరూ మ్యాజిక్ ఫిగర్‌కు చేరుకోకపోవడంతో మూడో స్థానంలో నిలిచిన కోరెడ్ల విజయగౌరికి లభించిన ఓట్లలో ద్వితీయ ప్రాధాన్య ఓట్లను లెక్కించారు. ఆమె ఎలిమినేషన్ తరువాత గాదె శ్రీనివాసులునాయుడు 9,237 ఓట్లు, వర్మకు 8,527 ఓట్లతో ఉన్నారు. ఈ క్రమంలో మ్యాజిక్ ఫిగర్ చేరుకోవడానికి శ్రీనివాసులునాయుడుకు 831 ఓట్లు అవసరమయ్యాయి. ఆ సమయంలో రఘువర్మ కౌంటింగ్ సెంటర్ నుంచి వెళ్లిపోయారు. అనంతరం శ్రీనివాసులునాయుడు విజయానికి అవసరమైన 831 ఓట్ల కోసం రఘువర్మకు పోలైన ఓట్లను లెక్కించారు. ఈ క్రమంలో శ్రీనివాసులునాయుడుకు 12,305 ఓట్లు వచ్చాయి. దాంతో శ్రీనివాసులునాయుడు విజయం సాధించినట్టు అధికారులు ప్రకటించారు.

మొదటి ప్రాధాన్య ఓట్లు ఎవరికెన్ని వచ్చాయంటే...

మొత్తం 20,794 ఓట్లు పోలవ్వగా 659 ఓట్లు చెల్లలేదు. మిగిలిన 20,135 ఓట్ల (మొదటి ప్రాధాన్య) లో కోరెడ్ల విజయగౌరికి 5,804, కోసూరు రాధాకృష్ణకు 30, గాదె శ్రీనివాసులనాయుడుకు 7210, దుర్గాప్రసాద్ పోతలకు 67, నూకల సూర్యప్రకాష్‌కు85, ఎస్.ఎస్.పద్మావతికి 15, పాకలపాటి రఘువర్మకు 6845, పెదపెంకి ప్రసాదరావుకు 15, రాయల సత్యనారాయణకు 31, సుంకరి శ్రీనివాసరావుకు 33 ఓట్లు వచ్చాయి.

'గాదె'కు ధ్రువీకరణ పత్రం అందజేత

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొందిన గాదె శ్రీనివాసులునాయుడుకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ సోమవారం రాత్రి 11 గంటలకు ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఓట్ల లెక్కింపు ముగిసిన అనంతరం వివరాలను ఎన్నికల కమిషన్‌కు పంపి, అక్కడ నుంచి అనుమతి వచ్చాక అధికారికంగా ప్రకటించి ధ్రువపత్రం అందజేశారు. ఎన్ని కల ప్రక్రియ సజావుగా సాగేందుకు సహకరించిన అధికారులు, సిబ్బందికి కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు.అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా బందోబస్తు నిర్వహించిన పోలీసులను అభినందించారు.

ఓడిపోయినా.. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి: రఘువర్మ

విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పాకలపాటి రఘువర్మ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వెలువడడానికి కొద్ది నిమిషాలు ముందు కౌంటింగ్ కేంద్రం నుంచి బయటకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. తాను ఓటమిని అంగీకరిస్తున్నానని, అయితే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి మాత్రం పోరాటం చేస్తానని స్పష్టంచేశారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని స్పష్టం చేశారు.

ఎగుమతుల కేంద్రంగా విశాఖ

... 5వ పేజీ తరువాయి

పేర్కొంది. ఐటీ సేవలను విస్తృతం చేయడానికి మండల స్థాయిలో అధికారులతో సమీక్షలకు వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాట్లు చేస్తున్నామని, ఇకపై ఎవరూ ఎక్కడికీ వెళ్లకుండా సమీక్షల్లో పాల్గొనవచ్చునని వెల్లడించింది. పరిశ్రమలకు అవసరమైన విద్యుత్‌ను నిరంతరం అందించడానికి కాపులుప్పాడ, అచ్యుతాపురం, చందనాడల్లో 900 మెగావాట్ల సామర్థ్యంతో సబ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్టు, వాటి పనులు ఇప్పటికే 65.59 శాతం పూర్తయినట్టు పేర్కొంది. వీటివల్ల 1,200 పరిశ్రమలకు విద్యుత్ సదుపాయం అందుతుంది. మేహాద్రిగెడ్డలో 3 మెగావాట్ల సోలార్ ప్లాంటు, ముడసర్లోవ పార్కు పునరుద్ధరణకు 10,650 మొక్కలు నాటినట్టు తెలిపింది. విశాఖపట్నం నుంచి భీమిలి వరకు బీచ్‌రోడ్డులో 6/8 వరుసల ఎక్స్‌ప్రెస్ వే నిర్మించనున్నట్టు వెల్లడించింది.

విశాఖలో సముద్ర ఉత్పత్తులు పెంచడానికి ఓపెన్ సీ కేజ్ కల్చర్, డీప్ సీ ఫిషింగ్‌ను ప్రోత్సహించనున్నారు. టూనా చేపల వేటకు అవసరమైన అధునాతన ట్రాలర్ల సమకూర్చుకునేందుకు రుణసాయం అందిస్తారు.

విశాఖపట్నం జిల్లాకు 1,39,501 గృహాలు మంజూరుచేయగా, వాటిలో 29,467 పూర్తయ్యాయని, ఇంకా 36,888 గృహాల పనులే ప్రారంభం కాలేదని నివేదికలో ప్రస్తావించారు. మిగిలిన గృహాలు వివిధ స్థాయిలో ఉన్నాయి.

ఉమ్మడి విశాఖ జిల్లాలో తొలి దశలో 2002 ఎకరాల్లో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేస్తున్నారని, రెండో దశకు మరో 4 వేల ఎకరాలు సేకరిస్తున్నట్టు పొందుపరిచారు.

- గిరిజన సహకార సంస్థ అరకు కాఫీకి ఆర్గానిక్ సర్టిఫికేషన్ తీసుకువచ్చిందని, మరింత మంది రైతుల పంటకు ఆ గుర్తింపు కోసం ప్రయత్నిస్తున్నదని, ఈ ఆర్థిక సంవత్సరంలో రెండు వేల టన్నుల కాఫీ సేకరణ లక్ష్యంతో పనిచేస్తున్నదని పేర్కొంది. కొయ్యూరు మండలం డౌనూరులో రూ.3 కోట్లతో ఇంటిగ్రేటెడ్ కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించింది.

జ్ఞానవేణికి ఉద్వాసన

... 5వ పేజీ తరువాయి

రుషికొండపై నిర్మించిన ప్యాలెస్ పనులను ఆయనే దగ్గరుండి పర్యవేక్షించారు. రుషికొండపై అంతకుముందున్న హరిత రిసార్ట్స్‌లోని ఫర్నీచర్‌ను అమ్ముకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రమణను తప్పించాలని విశాఖ జిల్లా ప్రజా ప్రతినిధులు కొందరు నేరుగా పర్యాటక శాఖ పెద్దలనే కోరారు. ఆర్‌డీగా అదనపు బాధ్యతలు ఇవ్వడం తగదని సూచించారు. ఆర్‌డీ కార్యాలయంలో సిబ్బంది కూడా ఆదాయం కోసం వెంపర్లాడుతున్నారని, వారిని కూడా మార్చాలని కోరారు. కానీ పర్యాటక శాఖ పెద్దలు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. విశాఖ నేతలు సూచించిన అధికారుల పేర్లను పక్కన పెట్టారు. ఇప్పుడు రుషికొండలో ఇంత రచ్చ జరిగిన తరువాత కూడా ఆ శాఖలో వారితోనే కుర్చీలాట ఆడారే తప్ప కఠిన చర్యలు ఏమీ తీసుకోలేదు. రమణను ఆర్‌డీగా తప్పించి అదే శాఖలో ఇక్కడే ఈఈగా ఉంచారు. రెండు జిల్లాల బాధ్యతలు చూస్తున్న దాస్‌ను తీసుకువచ్చి విశాఖ పర్యాటక శాఖ జిల్లా అధికారిగా నియమించారు. అలాగే డీవీఎంగా బీజీగా ఉండే జగదీశ్‌కు ఆర్‌డీగా అదనపు బాధ్యతలు ఇచ్చారు. పూర్తిస్థాయి అధికారులను వేయడానికి ఆ శాఖలో పెద్దలకు కలుగుతున్న ఇబ్బంది ఏమిటో అర్థం కావడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి ఇక్కడి అధికారులను మార్చాలనే అంతా చెబుతున్నారు. కానీ ఏ కారణాల చేతనో ఈఈ రమణతోనే వ్యవహారాలన్నీ నడిపిస్తున్నారు. కొత్త వారిని రానివ్వడం లేదు. జిల్లా నేతల అభ్యర్థనలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. పర్యాటక సంస్థలో మరొకాయన..'పత్రికల్లో చిన్నవే పెద్దవిగా రాస్తారు..వాటిని పట్టించుకోవద్దు" అంటూ పెట్టుబడిదారుల సదస్సులోనే ప్రకటించి అవినీతి అధికారులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ శాఖను పూర్తిగా ప్రక్షాళన చేయడం ఆ శాఖ పెద్దలకే ఇష్టం లేనట్టుగా ఉంది.

వాట్సాప్ ద్వారా టెన్త్ హాల్ టికెట్లు

... 5వ పేజీ తరువాయి

పుట్టిన తేదీ, మీడియం, ఫొటో, సంతకం, సబ్జెక్ట్ వంటివి పరిశీలించాలన్నారు. ఏమైనా పొరపాట్లు ఉంటే డైరెక్టర్, పరీక్షల విభాగానికి ఈ-మెయిల్ ద్వారా తెలియజేయాలని సూచించారు. విద్యార్థులు కూడా తమ హాల్ టిక్కెట్లను మన మిత్ర వాట్సాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చునన్నారు. ఇందుకోసం వాట్సాప్ నంబర్ 95523 00009కు 'హాయ్' అని మెసేజ్ చేస్తే అందులో శాఖల వారీగా అందుబాటులో ఉండే సేవల గురించి సమాచారం అందుతుందన్నారు. అందులో విద్యా శాఖను ఎంచుకొని ఎస్సెస్సీ హాల్ టిక్కెట్స్‌ను ఎంచుకోవాలని డీఈవో తెలిపారు.

నేడు విద్యుత్ లైన్‌మన్ దివస్



విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నిరంతర విద్యుత్ సరఫరాకు సహకరించే లైన్‌మన్లను సత్కరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మార్చి 4న 'లైన్‌మన్ దివస్' గా నిర్వహించాలని, ఉత్తమ సేవలుందించిన లైన్‌మన్లను గుర్తించి సత్కరించాలని సూచించింది. ఈ మేరకు తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ప్రతి డివిజన్ నుంచి ఇద్దరు లైన్‌మన్లను గుర్తించి మంగళవారం సన్మానించడానికి ఏర్పాట్లు చేసింది. వినియోగదారులకు ఎటువంటి సమస్య లేకుండా నిరంతర విద్యుత్ అందించేందుకు కృషిచేస్తున్న తమను గుర్తించి, సన్మానించడం గొప్ప విషయమని లైన్‌మన్లు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. జిల్లాలో సుమారు 750 మంది లైన్‌మన్లు ఉండగా వారిలో డివిజన్‌కు ఇద్దరు చొప్పున మొత్తం ఆరుగురిని మంగళవారం సత్కరించనున్నారు.

కత్తితో దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

కూర్మన్నపాలెం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఒకరిపై కత్తితో దాడికి పాల్పడిన వ్యక్తిని సోమవారం దువ్వాడ పోలీసులు అరెస్టు చేశారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదగంట్యాడ మండలం అప్పికొండ సమీప చేపల పాలెంలో చీడిపల్లి పరదేశి కుటుంబంతో ఉంటున్నాడు. ఆదివారం రాత్రి పరదేశి ఇంటికి అదే గ్రామానికి చెందిన చోడిపల్లి ప్రసాద్ వచ్చి నీ పెద్ద కొడుకు శివాజీ ఎక్కడ ఉన్నాడు, చంపేస్తానని బెదిరించాడు. ఏం జరిగిందని పరదేశి అడగ్గా.. శివరాత్రి నాడు తన స్నేహితుడు కుమారుడు శివకుమార్‌ను శివాజీ కొట్టాడని ప్రసాద్ తెలిపాడు. శివాజీని చంపితే రూ.30 లక్షల సుపారీ ఇస్తానని శివకుమార్ చెప్పాడని, అందువల్ల శివాజీని హతమారుస్తానని ఇంట్లోకి ప్రవేశించబోయాడు. దీంతో చుట్టుపక్కల వారితో పాటు పరదేశి అడ్డుకోవడంతో ప్రసాద్ కత్తితో దాడి చేశాడు. పరదేశి ఎడమ చేతికి స్వల్ప గాయంకావడంతో భయభ్రాంతులకు గురైన ఆయన కోడలు డయల్ 100కు ఫోన్ చేసింది. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చోడిపల్లి ప్రసాద్‌ను అరెస్టు చేశారు. ప్రసాద్, శివకుమార్‌ల వల్ల తమ కుటుంబానికి హాని ఉందని, రక్షణ కల్పించాలని పరదేశి పోలీసులను కోరాడు. పరదేశిఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న శివకుమార్ కోసం గాలిస్తున్నారు.

సినిమా గైడ్

- **శబ్దం :** సంగం, శారద, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక),
- **మజాకా :** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం),
- **డ్రాగన్ :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి),
- **తండేల్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, నరసింహ (గోపాలపట్నం), అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం :** మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 33, టమాటా 14, వంకాయలు (తెలుపు)26, వంకాయలు (నలుపు) 15, బెండకాయలు 44, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 40, బీరకాయలు 60, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 12, క్యారెట్ 30 దొండకాయలు 36, బంగాళ దుంపలు 15, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది)52, బరబాటి 36, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 34, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 110, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 30, కీరదోస 28, కాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 38 చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 52, గోరు చిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 46, బొప్పాయి 42, జామ కాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	455
విజయనగరం	459
శ్రీకాకుళం	459

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	95
లైవ్ ధర	115
విత్ స్కిన్	200
స్కిన్‌లెస్	210

పరిమితికి మించి బడ్డీల ఏర్పాటు



ఏఎస్ రాజా మైదానానికి ఆనుకుని ఉన్న బడ్డీలు



టీటీడీ కూడలి- ఉషోదయజంక్షన్ మార్గంలో..

- ఇరుకుగా ఎంవీపీ కాలనీ రహదారులు
- గత ప్రభుత్వ హయాంలో నేతల సహకారంతో యథేచ్ఛగా దుకాణాలు
- కూటమి ప్రభుత్వ కాలంలోనూ మారని తీరు
- చోద్యం చూస్తున్న గ్రేటర్ అధికారులు

ఎంవీపీ కాలనీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ... విశాఖలోనే పక్కా ప్రణాళిక ప్రకారం నిర్మించిన కాలనీ అని పేరు. వసతులకు కరవు లేదు. చక్కని రోడ్లు, ఇరువైపులా చెట్లు, వృక్షాలతో అలరారుతుంది. విద్యా సంస్థలు, అనేక రకాల వాణిజ్య సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు.. ఇలా ఒకటేమిటి అన్ని విధాలా అభివృద్ధిన చెందిన ప్రాంతంగా చెప్పుకోవచ్చు. విద్యావంతులు, వ్యాపారవేత్తలు, ప్రభుత్వ ఉద్యోగులు, రాజకీయ నాయకులకు నిలయమైన ఈ కాలనీ భూముల ధరలు కూడా ఎక్కువే. ఓ విధంగా చెప్పాలంటే నగరంలోని అన్ని ప్రాంతాల కంటే పన్నెండు సెక్టర్లుగా ఉన్న ఎంవీపీ కాలనీకి ఓ ప్రత్యేకత ఉంది. సర్వతోముఖాభివృద్ధి గాంచిన కాలనీగా చెపుతారు. నగరానికి ఎంవీపీ కాలనీ ఐకాన్. అందమైన ఈ కాలనీలో ఒక భూతం పెనుభూతమై కూర్చుంది. అవే బడ్డీలు. ఇందుగలవవు.. అందులేవని అన్నట్టుగా ఎంవీపీ కాలనీలోని ఏ కూడలి చూసినా బడ్డీల మయమే. గత ప్రభుత్వ హయంలో ఇష్టానుసారం బడ్డీలు పెట్టించారు. వైసీపీ నాయకులు భారీగా డబ్బులు వసూలు చేశారు. డబ్బులిస్తే ఎక్కడ కావాలంటే అక్కడ బడ్డీ పెట్టేసుకోవడానికి రాజకీయ నాయకులు అనుమతిలిస్తే, అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూస్తుండిపోయింది. మరి ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది కదా అంటే.. ఇప్పుడూ అంతే. కాకపోతే డబ్బుల బెడద లేదు. ఇంతకు ముందులా డబ్బులు వసూళ్ల పర్వం లేకపోవడం సంతోషించాల్సిన అంశమే అయినా, నగర అందాలకు గండి కొట్టేలా ఏ మూల చూసినా బడ్డీల మయమే. ఎక్కడ పడితే అక్కడ. ఫుట్‌పాత్‌లు, బస్ స్టాపులన్న మాట లేదు. కొన్ని చోట్ల రోడ్డు పక్కన బడ్డీలు తప్ప ఇంకేమీ కనిపించని పరిస్థితి. మరి జీవీఎంసీ యంత్రాంగం ఏం చేస్తుందనే ప్రశ్న సహజంగానే ఉత్పన్నమవుతుంది. షరా మామూలే! రాజకీయ నాయకుల సిఫార్సులకు 'జీ హుజీర్' అంటూ తలాడించేస్తుండడంతో, 'యథా రాజా తథా ప్రజా..' అన్నట్టు బడ్డీల ఏర్పాటు ఎక్కడికక్కడ నిరాటంకంగా సాగుతోంది. టీటీడీ కూడలి, ఉషోదయా కూడలి, ఎంవీపీ సర్కిల్ నుంచి ఏఎస్ రాజా కూడలి వరకూ, అలాగే టాస్క్ ఫోర్స్ కూడలి నుంచి ఎంవీపీ డబుల్ రోడ్డు, మరో వైపు స్పోర్ట్స్ ఎరీనా వైపు భారీ సంఖ్యలో బడ్డీలు విస్తరించి ఉన్నాయి.

ఇదో తరహా వ్యాపారం

బడ్డీల్లో వ్యాపారం చేయడం ఒక ఎత్తైతే, ఆ బడ్డీలతోనే వ్యాపారం చేయడం మరో గమ్మత్తు. రాజకీయంగా కాస్త పరపతి ఉన్నవారు వివిధ ప్రాంతాల్లో బడ్డీలు ఏర్పాటు చేసుకున్నారు. ఆ బడ్డీల్లో వీరు వ్యాపారం చేయరు. బడ్డీలను అద్దెకివ్వడమే వీరి వ్యాపారం. ఆయా కూడలి, అక్కడ జరిగే వ్యాపారాన్ని బట్టీ అద్దెలు ఉంటాయి. వీటి ధర నెలకు రూ. 5 వేల నుంచి రూ 15 వేల వరకూ ఉంటోంది. కొందరు వ్యక్తులు నాలుగైదు బడ్డీలను ఏర్పాటు చేసుకుని నెలకు రూ. 25 వేల నుంచి రూ 50 వేల వరకూ సంపాదిస్తున్నారు. కొన్ని చోట్ల చాలా బడ్డీలు ఖాళీగా ఉంటాయి. అంటే ఆ బడ్డీల్లో ఉన్న వారు ఖాళీ చేసేయడం, కొత్తవారు అద్దెకు రాకపోవడం వల్ల అవి ఖాళీగా ఉంటాయన్న మాట. మొత్తం మీద ఎంవీపీ అందాలకు ఈ బడ్డీలు గండి కొడుతున్నా, ఎవరూ పట్టించుకోవడం లేదు. ఓ వైపు స్మార్ట్ సిటీ అంటూ రూ.కోట్ల నిధులు మంజూరు చేసి, కూడళ్లు అభివృద్ధి చేస్తున్నా, మరో వైపు అదే కూడళ్లలో ఓ పద్ధతి లేకుండా బడ్డీలమీద బడ్డీలు వరుసగా ఉంటున్నాయి.

దుకాణాలను జీవీఎంసీ ఏర్పాటు చేస్తే మేలు

ఈ సమస్య పరిష్కారానికి ఎంవీపీలోనే నాలుగైదు కూడళ్లను గుర్తించి, బడ్డీల స్థానంలో చిన్నపాటి దుకాణాలను జీవీఎంసీనే నిర్మిస్తే బాగుంటుందన్న ప్రతిపాదన ఈ ప్రాంతీయుల నుంచి వినిపిస్తోంది. ఒక పద్ధతి ప్రకారం దుకాణాలు నిర్మించడం వల్ల నగరానికి అందంగానూ ఉంటుందని అంటున్నారు, జీవీఎంసీకి ఆదాయమూ వస్తుంది. ముఖ్యంగా బడ్డీల్లో జరిగే వ్యాపారం చాలా చిన్నదే ఉంటుంది. కాబట్టి చిన్న పరిమాణంలో దుకాణాలను నిర్మించడం వల్ల ఉపయోగం ఉంటుందని పలువురు అంటున్నారు.

జీవీఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు దీనిపై దృష్టి సారించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కుట్టా కార్తీక్

చలివేంద్రం ప్రారంభం

కంచరపాలెం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 54వ వార్డు పరిధి ఐటీఐ జంక్షన్ వద్ద పైడిమాంబ ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రాన్ని టీడీపీ నాయకుడు కుట్టా కార్తీక్ ప్రారంభించారు. అనంతరం పాదచారులు, వాహనదారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో స్టాండ్ ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

వైసీపీ అధినేతకు నిజాయితీ ఉంటే అసెంబ్లీకి రావాలి: ఎమ్మెల్యే వంశీకృష్ణ

అమరావతి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేతకు నిజాయితీ ఉంటే ప్రజా సమస్యలపై చర్చించడానికి అసెంబ్లీకి రావాలని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. వైసీపీకి 11 సీట్లు ఇచ్చింది ఇంట్లో విశ్రాంతి తీసుకోవడానికో, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడానికో కాదన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో సోమవారం ఆయన మాట్లాడుతూ, 'ప్రతిపక్ష హోదా ఇచ్చేది ప్రజలేనని, అధికార పార్టీ నాయకులు కాదనే విషయాన్ని వైసీపీ నేతలు గమనించాలన్నారు. రుషికొండ బీచ్‌కు బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్‌పై వైసీపీ నేతలు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

6 నుంచి యల్లమాంబ జాతర మహోత్సవాలు



యల్లమాంబ ఆలయం

వెంకోజీపాలెం, మార్చి (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 15 వార్డులోని పాతవెంకోజీపాలెం యల్లమాంబ నగర్‌లో వేంచేసి ఉన్న యల్లమాంబ అమ్మవారి వార్షిక ఉత్సవాలు ఈ నెల 6వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు కాలనీ సేవా కమిటీ అధ్యక్షుడు వారణాసి విశాలాక్షి, కార్యదర్శి కాళ్ల కుమార్ తెలిపారు. 6న జాతర తోలేళ్లు, 7న అమ్మవారి జాతర ముగింపు మహోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా తెల్లవారు జాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయని చెప్పారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమలను అందజేయాలని కోరారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధులలో ఊరేగింపు, మేళతాళాలతో సేవా గరిడి, డప్పులు, కోలాటం, గ్రామ దేవతల ప్రోగ్రా మ్, తీన్‌మాన్, మందుగుండు సామగ్రి వాయిద్య బృందాలతో అమ్మవారి ఊరేగింపు ఉంటుందన్నారు.

నేడు కృష్ణా కళాశాలలో జాబ్‌మేళా

మద్దిలపాలెం, మార్చి3 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ వీఎస్ కృష్ణా డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు తెలిపారు. హెటిరో డ్రగ్స్, యోకోహమ టైర్స్ సంస్థలు ఉద్యోగాల భర్తీకి ఈ మేళా చేపట్టామన్నారు. హెటిరో డ్రగ్స్‌లో 70 జూనియర్ కెమిస్ట్ ఉద్యోగాలు, 25 ఐటీఐ ఫిట్టర్ అప్రెంటిషిప్‌కు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని చెప్పారు.

కనుమరుగవుతున్న మహిళా చట్టాలు

ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల



మాట్లాడుతున్న అత్తిలి విమల

పెందుర్తి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మహిళల చట్టాలు నిర్వీర్యంతో హక్కులు, భద్రత కనుమరగవుతున్నాయని ఏపీ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల అన్నారు. మహిళా సమాఖ్య పెందుర్తి ఏరియా సమితి ఆధ్వర్యంలో సోమవారం సుజాతనగర్ నుంచి గిరిప్రసాద్ నగర్ వరకు మహిళా దినోత్సవ వారోత్సవాల ర్యాలీని నిర్వహించారు. ఈ సంద ర్భంగా మహిళలపై హింసను అరికట్టాలని, చట్టసభలో 33 శాతం రిజర్వేషన్‌ను అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. అనంతరం విమల సమాఖ్య పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఉద్యమాలతోనే మహిళలు హక్కులను సాధించుకోవాలన్నారు. సమాఖ్య జిల్లా కార్య దర్శి ఎంపి బేగం మాట్లాడుతూ బీజేపీ కేంద్రపాలిత రాష్ట్రాల్లో మహిళాహింస అధికంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యురాలు పుష్ప, పెందుర్తి ఏరియా ప్రతినిధులు ఎ.అన్నపూర్ణ, ఎన్. అరుణ, పావని, లక్ష్మీవిజయ పాల్గొన్నారు.

భారీ లోడు.. నిబంధనలు పట్టించుకోరు!



భారీ లోడుతో వాహనం నడుపుతూ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతున్న డ్రైవర్

డ్రైవింగ్ చేస్తూ ఫోన్ మాట్లాడకూడదన్న నిబంధనను వాహన చోదకులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. భారీ లోడుతో మినీ ట్రాన్స్‌పోర్ట్ వాహనం నడుపుతున్న ఓ చోదకుడు ఇలా నిర్లక్ష్యంగా సెల్ ఫోన్ మాట్లాడుతూ సోమవారం పురుషోత్తపురం వద్ద కనిపించాడు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

ఏయూ ఇంటర్ కాలేజియట్ కమ్ యూనివర్సిటీ జట్ల ఎంపిక



పోటీలను ప్రారంభిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

వెంకోజీపాలెం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఏయూ ఇంటర్ కాలిజియట్ కమ్ యూనివర్సిటీ జట్టు ఎంపికలు సోమవారం ఏయూ టెన్నిస్ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ ముఖ్యఅతిధిగా పాల్గొని పోటీలను ప్రారంభించారు.

అనంతరం పోటీలు పాల్గొంటున్న క్రీడాకారులను అభినందించారు. యూనివర్సిటీ తరపున క్రీడల్లో పాల్గొని ప్రతిభ సాధించి వర్సిటీకీ పేరు తేవాలన్నారు. ఈ సందర్భంగా ఏయూ ఇంటర్ కాలిజియట్ జట్లు సమతా కళాశాల, ఏయూ ఆర్ట్స్, డాక్టర్ వీఎస్ కృష్ణా డిగ్రీ, పీజీ కళాశాల, ఏవీఎన్ కళాశాల, గాయత్రి కళాశాల తదితర బాల్ బ్యాడ్మింటన్ జట్లు పరియ కార్యక్రమంలో పాల్గొన్నాయి. అలాగే మహిళల ఇంటర్ కాలిజియట్ జట్లు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు, ఏయూ వ్యాయామ విద్యా విభాగాధిపతి ఎ. పల్లవి, ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యూకేషన్ ఎన్.విజయమోహన్, ఐపీ స్పోర్ట్స్ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ వీఎస్ కృష్ణా డిగ్రీ, పీజీ కళాశాల లెక్చరర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ కిరణ్మయి, తదితర కళాశాల పీడీలు, క్రీడాకారులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఏయూ వీసీని కలిసిన కృష్ణా కళాశాల సిబ్బంది



వీసీ రాజశేఖర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలుపుతున్న కృష్ణా కళాశాల అధ్యాపకులు, సిబ్బంది

మద్దిలపాలెం, మార్చి3 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టిన జి.పి.రాజశేఖర్‌ను మంగళవారం డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు మర్యాదపూర్వ కంగా కలిశారు. వీసీకి పుష్పగుచ్ఛం అంద జేసి శుభకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విజయబాబుతో కళాశాల నిర్వహణ ఇతరత్రా అంశాల గురించి వీసీ అడిగి తెలుసుకున్నారు. నాక్ గుర్తింపుతో పటిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కళాశాలను మరింత ప్రగతిపథంలో నడిపించాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పి.జయ, డి.శ్రావణ్‌కుమార్, కె.రవిబాబు, పి.ఉమామహేశ్వరరావు, రాజేశ్వరరావు, పి.గోపాల్ నాయుడు, జి.లక్ష్మణరావు, జీవీ ప్రతాప్ పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన కల్పిస్తూ బైక్ ర్యాలీ



మహిళా సాధికారతపై అవగాహన కల్పిస్తూ బైక్ ర్యాలీలో పాల్గొన్న సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది

ఎంవీపీ కాలనీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో సోమవారం ఎంవీపీ కాలనీ సంక్షేమ భవన్ వద్ద బైక్ ర్యాలీ నిర్వహించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆర్జేడీ చిన్మయిాదేవి, ప్రాజెక్టు డైరెక్టర్ జయదేవి ర్యాలీ ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా బాలికల హక్కులు, లింగ సమానత్వం, సాధికారత అనే అంశాలపై అన్ని ఐసీడీఎస్‌ల పరిధిలో వారం రోజుల పాటు మహిళా చైతన్యం కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్టు అధికారులు పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కె.రామారావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ మల్లీశ్వరి, ఎస్ఐ రూపవతి, నోడల్ అధికారులు శారదా, శ్రీకళ, ఏసీడీపీవో శ్రీలత, ఐసీపీఎస్, శిశుగృహ, వన్‌స్టాప్ సెంటర్, గృహ హింస సెల్‌కు చెందిన ఉద్యోగులు బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.

'గాదె' గెలుపులో పీఆర్టీయూ నేతల సంబరాలు



ఏయూ ఇంజినీరింగ్ కళాశాల వద్ద సంబరాలు జరుపుకుంటున్న పీఆర్టీయూ నాయకులు

మద్దిలపాలెం, మార్చి3(ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గాదె శ్రీనివాసులు విజయం సాధించడంతో ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్టీయూ)నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల వద్ద సోమవారం పీఆర్టీయూ నాయకులు, కార్యకర్తలు విజయోత్సవంతో ఉప్పొంగిపోయారు. ఒకరొకరు మిఠాయిలు తినిపించుకుని సందడి చేశారు.

ఈ సందర్భంగా పీఆర్‌టీయూ ఉమ్మడి జిల్లా కన్వీనర్ గోపినాథ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో గాదె శ్రీనివాసులు దిట్టని అభివర్ణించారు. రెండు దపాలు ఎమ్మెల్సీగా ఉపాధ్యాయుల పక్షాన నిలబడి ఎంతోమందికి అండగా నిలిచారన్నారు. అందుకే ఈ ఎన్నికల్లో గాదె శ్రీనివాసులకే ఉపాధ్యాయులు పట్టం కట్టారన్నారు. ఆయనకు ఓటేసి గెలిపించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు పైడిరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిలపాలెంలో 'గాదె' మద్దతుదారుల ఆందోళన



ఆందోళన చేస్తున్న గాదె శ్రీనివాసులునాయుడు మద్దతుదారులు

విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) :ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విజేతగా గాదె శ్రీనివాసులనాయుడు పేరు అధికారికంగా ప్రకటించడంలో జాప్యం చేస్తున్నారని పేర్కొంటూ ఆయన మద్దతుదారులు సోమవారం రాత్రి మద్దిలపాలెం జంక్షన్‌లో ఆందోళన చేశారు. అయితే తూర్పు ఏసీపీ లక్ష్మణమూర్తి వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని వారికి నచ్చచెప్పడంతో ఆందోళన విరమించారు.

జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్

వెంకోజీపాలెం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం, సెంటర్ ఫర్ సోషల్ ఇంక్లూజన్ సంయుక్తంగా ఏప్రిల్ 3, 4 తేదీల్లో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. "ఆర్థిక సమ్మిళత - సామాజిక సమానత్వం: 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ ఒక రోడ్ మ్యాప్" అనే అంశంపై జాతీయ సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఎన్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.నరసింహారావు, సదస్సు కన్వీనర్ జాలాది రవి, సదస్సు సహ కన్వీనర్ డాక్టర్ పి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సదస్సు నిర్వాహకులను వీసీ అభినందించారు. వర్తమాన ప్రాధాన్యం కలిగిన అంశంపై సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు.

భక్తిశ్రద్ధలతో ముత్యాలమ్మ పుట్టమన్ను ఊరేగింపు



ముత్యాలమ్మ పుట్టమన్ను తీసుకువెళ్తున్న నక్కవానిపాలెం గ్రామస్థులు

సీతమ్మధార, మార్చి 3, (ఆంధ్రజ్యోతి): నక్కవానిపాలెం గ్రామ దేవత ముత్యాలమ్మ, ఏడుగుళ్ల అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ముత్యాలమ్మవారి దేవర పుట్టమన్ను పూజ లు జరిగాయి. రామాలయం పెద్దింటి వద్ద నుంచి పుట్టమన్నును మేళతాళలతో ఊరేగింపుగా తీసుకువచ్చి ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయం వద్ద ఉంచి పూజలు చేశారు. అనంతరం అక్కడి నుంచి జంగడిలో అమ్మవారి పూజా సామాగ్రితో పెద్దింటికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలను పరిశీలించిన జేసీ


పరీక్షల తీరును పరిశీలిస్తున్న జేసీ మయూర్‌అశోక్

డాబాగార్డెన్స్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షల నిర్వహణను సోమవారం జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ పరిశీలించారు. పాత జైల్‌రోడ్డులోని విశాఖ ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు.

తెలుగు సామర్థ్యం పెరిగితేనే మనోవికాసం: ఎంఈవో


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో రామారావు

సీతంపేట, మార్చి 3, (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 5వ వార్డు సీతంపేట మధురానగర్‌లో గల జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో డి.రామారావు సోమవారం తనిఖీ చేశారు. 3, 4, 5 తరగతుల్లో విద్యార్థుల తెలుగు సామర్థ్యాలను పరిశీలించి వారి స్థాయిలను గుర్తించారు. తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడి తెలుగు పాఠ్యాంశాలు, భాషపై పట్టు పెంచుకోవాలన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

12 కిలోల గంజాయి స్వాధీనం

విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని రైల్వే పోలీసులు సోమవారం పట్టుకున్నారు. అతని నుంచి 12 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ ఎస్ఐ ఎస్.రామారావు, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ జె.టి.నాయుడు తమ సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఒడిశాకు చెందిన రింకీ మాలి ముంబైకు గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డాడని, అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

రైల్వే రిజర్వేషన్ కార్యాలయంలో డీఆర్ఎం తనిఖీలు


రిజర్వేషన్ కార్యాలయం వద్ద తనిఖీ చేస్తున్న డీఆర్ఎం


రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంలను పరిశీలిస్తున్న డీఆర్ఎం లలిత్ బోహ్రా

విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్ సమీపంలోని కంప్యూటర్ రిజర్వేషన్ కార్యాలయంలో డీఆర్ఎం లలిత్ బొహ్రా సోమవారం తనిఖీలు చేశారు. రిజర్వేషన్ కార్యాలయంలో టికెట్ జారీ విధానంలో పాటిస్తున్న నిబంధనలు, డిజిటల్ చెల్లింపు విధానాల నిర్వహణను పరిశీలించారు. అలాగే కార్యాలయం వద్ద పార్కింగ్ ఏరియాను పరిశీలించి పలు సూచనలు చేశారు. అక్కడి నుంచి స్టేషన్‌కు చేరుకుని ప్లాట్‌ఫామ్‌లపై అమ్మకాలు చేపట్టే స్టాల్స్‌ను పరిశీలించారు. స్టాల్స్ నిర్వాహకులు ప్రయాణికులకు అందించే నాణ్యత, ధరలపై కమర్షియల్ అధికారులతో చర్చించారు. అనంతరం పార్శిల్ కార్యాలయం, న్యూ కోచింగ్ కాంప్లెక్సులో పర్యటించి విధుల నిర్వహణ, ఇతరత్రా అంశాలను పరిశీలించారు.

కిరండూల్ రైలు దంతెవాడ వరకే

విశాఖపట్నం: కేకే లైనులో ఆధునికీకరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో విశాఖ, కిరండూల్ మధ్య నడుస్తున్న రైళ్ల సర్వీసులు ఈ నెల ఏడు నుంచి 16వ తేదీ వరకు విశాఖ-దంతెవాడ మధ్య రాకపోకలు సాగించేలా గమ్యాలను తాత్కాలికంగా కుదించామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. దీంతో విశాఖ-కిరండూల్ పాసింజర్ (58501), విశాఖ-కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్ (18515) రైళ్లు ఈ నెల ఏడు నుంచి 15వ తేదీ వరకు విశాఖ నుంచి దంతెవాడ వరకు, తిరుగు ప్రయాణంలోని కిరండూల్-విశాఖ పాసింజర్ (58502), కిరండూల్-విశాఖ నైట్ ఎక్స్‌ప్రెస్ (18516) రైళ్లు ఈ నెల ఎనిమిది నుంచి 16వ తేదీ వరకు దంతెవాడ నుంచి విశాఖకు నడుస్తాయని పేర్కొన్నారు. దంతెవాడ, కిరండూల్ మధ్య రాకపోకలను తాత్కాలికంగా రద్దు చేశామన్నారు.

'కార్మిక సమస్యలపై పోరాటానికి సిద్ధంకండి'

అల్లిపురం, మార్చి3 (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో పనిచేస్తున్న అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని జిల్లా సమితి ప్రధాన కార్యదర్శి జీఎస్‌జే అచ్యుతరావు పిలుపునిచ్చారు. అల్లిపురం నీలంరాజశేఖర్‌రెడ్డి భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్, జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం, ముఠా కార్మిక సంఘం,సివిల్ సప్లైస్ కార్మిక సంఘం, కాంట్రాక్టు వర్కర్స్, వీధి విక్రయదారులు, చిరువ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం ఎదుట ధర్నా చేస్తామన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు మన్మథరావు, వెంకటరావు, రెహమాన్, గోవింద్, సత్యాంజనేయ, తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ ప్రిన్సిపాల్‌కు అభినందనలు


ప్రిన్సిపాల్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డా.ఫణీంద్ర

మహారాణిపేట, మార్చి3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులైన డాక్టర్ కేవీఎస్ఎన్ సంధ్యాదేవిని ప్రముఖ పల్మానాలజీ వైద్యుడు, ఐఎంఏ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ కేతా ఫణీంద్ర సోమవారం కలిశారు. సమర్థ వ్యక్తిని ప్రిన్సిపాల్‌గా ఎంపిక చేశారన్నారు. అనంతరం ఆమెకు పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. వైద్య కళాశాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

శిష్టకరణ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గం


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

డాబాగార్డెన్స్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): శిష్ట కరణ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గం ఎన్నికలను డాబాగార్డెన్స్ ప్రేమ సమాజంలో సోమవారం నిర్వహించారు. ఎన్నికల అధికారి పి.రామచంద్రరావు, కమిటీ సభ్యుడు ఎన్‌వీఎస్ శర్మ, ఎస్.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లాల వారీగా ఓటు హక్కును కల్పించి నూతన అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అక్కుమహంతి నాగేశ్వరరావు (రాజా), ప్రధాన కార్యదర్శిగా ఎం.గౌరీశంకర్, కోశాధికారిగా బి.రాధాకుమారి, కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం సభ్యులకు ధ్రువీకరణ పత్రాలను అందించి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

శీతల పానీయాల కంపెనీ సీజ్

జ్ఞానాపురం, మార్చి3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-5 38వార్డులో ఒక శీతల పానీయాల కంపెనీకి జీవీఎంసీ అధికారులు సీజ్ చేశారు. ఆస్తిపనున్న బకాయి రూ.12.31 లక్షలు చెల్లించకపోవడంతో కమిషనర్ ఆదేశాల మేరకు జోన్ అసిస్టెంట్ కమిషనర్ బాబూరావు, ఆర్ఐ శ్రీనివాస్, అడ్మిన్‌ల సమక్షంలో సోమవారం కంపెనీకి తాళాలు వేశారు.

రేపటి నుంచి రేణుక ఎల్లమ్మ జాతర


కరపత్రం ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

అల్లిపురం, మార్చి3 (ఆంధ్రజ్యోతి):అచ్చియ్యమ్మపేట రేణుక యల్లమ్మ 25వ వార్షిక జాతర మహోత్సవాలు ఈనెల ఐదు నుంచి ఏడో తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఆలయ గౌరవాధ్యక్షుడు పీల వెంకట అప్పల నాయుడు, అధ్యక్షుడు కర్రి నీలకంఠం తెలిపారు. ఈ మేరకు సోమవారంజాతర కరపత్రాన్ని కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఐదున గౌరవాధ్యక్షుడికి ఇంటి నుంచి అమ్మవారి అభరణాల ఊరేగింపు, 6న తొలేళ్లు, ఏడో తేదీన ప్రధాన ఉత్సవం నిర్వహిస్తామన్నారు. ఆ రోజు వంద కలశాలతో మహిళలు పోలేరమ్మ సతకం పట్టు నుంచి తిరువీధి నిర్వహించి అమ్మవారికి జలాభిషేకం చేస్తారన్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించామని, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో వాసుపల్లి నారాయణ, పంపాన గణేష్, బొడ్డేటి ప్రసాద్, గనగళ్ల సత్య కామేశ్వర శర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు పైడిమాంబ ప్రధాన పండుగ

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు తిక్కవానిపాలెం గ్రామంలో కొలువై ఉన్న పైడిమాంబ అమ్మవారి ప్రధాన పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ అధ్యక్షకార్యదర్శి ఉమ్మిడి వాసుదేవరావు, పట్టిమ రాజు తెలిపారు. అమ్మవారి ప్రధాన పండుగ సందర్భంగా గ్రామంలో ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కాగా సోమవారం అమ్మవారి తొలేళ్ల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలేళ్ల ఉత్సవం సందర్భంగా భక్తులు అమ్మవారి ప్రతిమలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

రాష్ట్ర స్థాయి సీనియర్ హాకీ టోర్నీకి విశాఖ జట్టు

విశాఖపట్నం, స్పోర్ట్సు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల హాకీ చాంపియన్ షిప్ టోర్నీలో పాల్గొనే విశాఖ జట్టు సభ్యుల జాబితాను సోమవారం ప్రకటించారు. ఈ నెల ఆరో తేదీ నుంచి గుంటూరులో జరగనున్న ఈ టోర్నీలో 18 మంది ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా హాకీ సంఘం కార్యదర్శి కేవీ అంజనేయరావు తెలిపారు. జట్టులో రాజప్రభాకర్ పవన్, బోని ప్రశాంత్, సీహెచ్‌వీ మూర్తి, వై.భార్గవ్, డి.ప్రసాద్, బి.వెంకటరమణ, కె.వాసుదేవ, శ్రీరామ్ రాజేశ్ శ్యామ్‌వర్మ, ఎన్.రాజేశ్వర రావు, డి.ప్రవీణ్, ఎన్.లోకేశ్‌రాజు, ఎస్.మోహన్, హెచ్.జుషి, పి.పౌల్, సంజయ్‌కుమార్, ఎస్.నూకరాజు, షేక్ సాదిక్, డి.పవన్ ఉంటారు. ఈ జట్టుకు కోచ్‌గా జి.రాంజీ, మేనేజర్‌గా డి.లోకేశ్ వ్యవహరిస్తారని ఆయన వివరించారు.

తండ్రి చెంతకు చేరిన కుమారుడు


అరుణవ్ దేవ్‌ను తండ్రికి అప్పగిస్తున్న శ్రద్ధ ఫౌండేషన్ సభ్యులు

అక్కయ్యపాలెం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వచ్చేసిన ఓ వ్యక్తిని తిరిగి తండ్రి వద్దకు చేర్పినట్టు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. త్రిపుర రాష్ట్రంలోని నార్త్ త్రిపుర జిల్లా కుమార్ ఘాట్‌కు చెందిన అరుణవ్ దేవ్(30) తల్లి అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆయన తండ్రి రెండో పెళ్లి చేసుకోవాల్సి వచ్చింది. ఈ విషయం నచ్చని అరుణవ్ దేవ్ తండ్రితో విభేదించి ఇంటి నుంచి బయటకు వచ్చేశాడు. అతనిని ఏయూటీడీ సిబ్బంది గతేడాది నవంబరు లో పట్టుకుని ఇక్కడి షెల్టర్‌లో ఆశ్రయం కల్పించి చికిత్స అందజేశారు. కొన్నాళ్లకు అతను సాధారణ స్థితికి చేరాడు. దీంతో అతనిని విశాఖ నుంచి శ్రద్ధా ఫౌండేషన్ సభ్యులు త్రిపుర తీసుకు వెళ్లి తండ్రికి అప్పగించారు. 18 నెలల తరువాత కుమారుడిని చూసిన తండ్రి ఆనందం వ్యక్తం చేశారు.

పన్ను వసూళ్లపై గ్రేటర్ దృష్టి

... 5వ పేజీ తరువాయి

నెలలో ఏకంగా రూ.62 కోట్లు వసూలవ్వడం విశేషం. ఆర్థిక సంవత్సరం ముగియనుండడంతో మార్చి నెలలో పన్ను వసూళ్లు మరింత ఎక్కువగా ఉంటాయని రెవెన్యూ విభాగం అధికారులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. ఈ ఏడాదికి సంబంధించిన పన్నుతోపాటు పెండింగ్‌లో ఉండిపోయిన ఆస్తి పన్ను బకాయిలు, నీటి పన్ను బకాయిలను కూడా రాబట్టడంపై రెవెన్యూ విభాగం అధికారులు దృష్టిసారించారు. జీవీఎంసీ పరిధిలో 1,13,236 అసెస్‌మెంట్‌ల నుంచి రూ.56 కోట్ల మేర ఆస్తి పన్ను బకాయిలు రావలసి ఉన్నట్టు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. బకాయిలను తక్షణం చెల్లించాలని కోరుతూ జప్తు నోటీసులు జారీచేసే ప్రక్రియను ప్రారంభించారు. ఇప్పటివరకూ 90,346 అసెస్‌మెంట్‌లకు నోటీసులు జారీచేయగా, మిగిలిన వాటికి బుధవారం లోగా అందజేయాలని నిర్ణయించారు. నెలాఖరులోగా బకాయిలు చెల్లించకపోతే ఆయా ఆస్తులను జప్తు చేస్తామని నోటీసులో స్పష్టంచేస్తున్నారు. మరోవైపు నీటి చార్జీలు (కొళాయి పన్ను) వసూలుచేసే బాధ్యత కూడా రెవెన్యూ విభాగమే చూస్తోంది. రెగ్యులర్‌తోపాటు బకాయిలను కూడా రాబట్టేందుకు చర్యలు ప్రారంభించింది. జీవీఎంసీ పరిధిలో 58,782 అసెస్‌మెంట్ల నుంచిరూ.39 కోట్లు వసూలుకావాల్సి ఉంది. ఆ మొత్తాన్ని కూడా నెలాఖరులోగా క్లియర్ చేసుకోవాలని, లేనిపక్షంలో కొళాయి కనెక్షన్ తొలగిస్తామని హెచ్చరిస్తూ నోటీసులు జారీచేస్తున్నారు. నీటి చార్జీలకు సంబంధించి బకాయి ఉన్నవారిలో 45,130 మందికి ఇప్పటికే నోటీసులు జారీచేయగా, మిగిలిన వారికి బుధవారం నాటికి పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. బకాయిలు వసూలైతే ఆస్తిపన్ను వసూళ్లలో జీవీఎంసీ ఈ ఏడాది సరికొత్త రికార్డు సృష్టించడం ఖాయమని అధికారులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

ప్రతిరోజూ తరగతులకు హాజరుకావాలి

... 5వ పేజీ తరువాయి

విభాగంలో ఉన్న సమస్యలను పరిష్కరించి, వసతులు మెరుగుపరిచి అభివృద్ధి దిశగా నడిపించే ప్రయత్నం జరుగుతుందన్నారు. త్వరలో శతాబ్ది ఉత్సవాలు జరగనున్నాయని, ఈ ప్రక్రియలో ప్రతి విభాగం భాగస్వామ్యం కావాలన్నారు. అందరి సహకారంతో కార్యక్రమాలను సమర్థంగా నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎస్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇ.ఎన్. ధనుంజయరావు, ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ ఎ.నరసింహరావు, జి.శశిభూషణరావు, జి.గిరిజాశంకర్, ఎంవీఆర్ రాజు, కె.సీతామాణిక్యం, డి.నాగరాజకుమారి, ఆర్.పద్మశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

'నజీర్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి'



నిరసన తెలుపుతున్న ముస్లింలు

అక్కయ్యపాలెం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ నజీర్‌కు ఎమ్మెల్సీగా అవకాశమివ్వాలని మజీద్ కమిటీ అధ్యక్షుడు నవాబ్‌బాయి, ఇషాక్ కూటమి ప్రభుత్వాన్ని కోరిం ది. ఈ మేరకు చిన్నారులోని మసీద్ దగ్గర సోమవారం నిరసన తెలిపారు. ముస్లింలందరికీ న్యాయం జరగాలంటే నజీర్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలన్నారు. ఏ ప్రభుత్వమూ ముస్లింలకు ప్రత్యేకస్థానం ఇవ్వడం లేదన్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా నజీర్‌కు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి ముస్లింల ఆకాంక్ష తీర్చాలన్నారు. మైనారిటీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖా మంత్రి లోకేశ్ న్యాయం చేయాలని కోరారు.

ఎమ్మెల్సీ గద్దెపై గాదె

... 5వ పేజీ తరువాయి


ఓట్ల లెక్కింపును పర్యవేక్షిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

కేటాయించిన సిబ్బంది లెక్కించారు. మొత్తం 20,794 ఓట్లు పోల్ కాగా, 20,135 ఓట్లు చెల్లినవిగా, 659 ఓట్లు చెల్లనవిగా గుర్తించారు. మధ్యాహ్నం రెండు గంటల సమయానికి తొలి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు పూర్తయ్యింది. మొదటి ప్రాధాన్య ఓట్లలో గాదె శ్రీనివాసులునాయుడుకు 7,210, పాకలపాటి రఘువర్మకు 6,845, కోరెడ్ల విజయగౌరికి 5,804 రాగా, మిగిలిన ఏడుగురు అభ్యర్థులకు వంద కంటే తక్కువ వచ్చాయి. విజేతను ప్రకటించాలంటే పోలైన ఓట్లలో 50 శాతం కంటే అదనంగా ఒక్క ఓటైనా రావాలి. అంటే చెల్లిన ఓట్లు 20,1345లో 10,067 ప్లస్ ఒకటి..10,068 ఓట్లను సాధించాలి. అయితే, మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు పూర్తయ్యేసరికి పోటీలో ఉన్న అభ్యర్థులెవరూ మ్యాజిక్ ఫిగర్ దక్కించుకోకపోవడంతో రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపు అనివార్యమైంది.

రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపుతో విజయం..

మధ్యాహ్నం భోజన విరామం తరువాత రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపు ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. మొదట తక్కువ ఓట్లు లభించిన అభ్యర్థుల రెండో ప్రాధాన్య ఓట్లను లెక్కిస్తూ ఎలిమినేషన్ ప్రక్రియను చేపట్టారు. రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపులో రెండో రౌండ్‌లో పెదపెంకి శివప్రసాద్, మూడో రౌండ్‌లో ఎస్ఎస్ పద్మావతి, నాలుగు రౌండ్‌లో రాధాకృష్ణ, ఐదో రౌండ్‌లో సత్యనారాయణ, ఆరో రౌండ్‌లో శ్రీనివాసరావు, ఏడో రౌండ్‌లో దుర్గా ప్రసాద్, ఎనిమిదో రౌండ్‌లో సూర్యప్రకాష్‌ను ఎలిమినేట్ చేశారు. ఎనిమిది రౌండ్లు పూర్తయ్యేసరికి గాదె శ్రీనివాసులునాయుడుకు 7,248 ఓట్లు, పాకలపాటి రఘువర్మకు 6,881 ఓట్లు, కోరెడ్ల విజయగౌరికి 5,872 ఓట్లు లభించాయి. అప్పటికి కూడా ఎవరూ మ్యాజిక్ ఫిగర్‌కు చేరుకోకపోవడంతో మూడో స్థానంలో నిలిచిన కోరెడ్ల విజయగౌరికి లభించిన ఓట్లలో ద్వితీయ ప్రాధాన్య ఓట్లను లెక్కించారు. ఆమె ఎలిమినేషన్ తరువాత గాదె శ్రీనివాసులునాయుడు 9,237 ఓట్లు, వర్మకు 8,527 ఓట్లతో ఉన్నారు. ఈ క్రమంలో మ్యాజిక్ ఫిగర్ చేరుకోవడానికి శ్రీనివాసులునాయుడుకు 831 ఓట్లు అవసరమయ్యాయి. ఆ సమయంలో రఘువర్మ కౌంటింగ్ సెంటర్ నుంచి వెళ్లిపోయారు. అనంతరం శ్రీనివాసులునాయుడు విజయానికి అవసరమైన 831 ఓట్ల కోసం రఘువర్మకు పోలైన ఓట్లను లెక్కించారు. ఈ క్రమంలో శ్రీనివాసులునాయుడుకు 12,305 ఓట్లు వచ్చాయి. దాంతో శ్రీనివాసులునాయుడు విజయం సాధించినట్టు అధికారులు ప్రకటించారు.

మొదటి ప్రాధాన్య ఓట్లు ఎవరికెన్ని వచ్చాయంటే...

మొత్తం 20,794 ఓట్లు పోలవ్వగా 659 ఓట్లు చెల్లలేదు. మిగిలిన 20,135 ఓట్ల (మొదటి ప్రాధాన్య) లో కోరెడ్ల విజయగౌరికి 5,804, కోసూరు రాధాకృష్ణకు 30, గాదె శ్రీనివాసులనాయుడుకు 7210, దుర్గాప్రసాద్ పోతలకు 67, నూకల సూర్యప్రకాష్‌కు85, ఎస్.ఎస్.పద్మావతికి 15, పాకలపాటి రఘువర్మకు 6845, పెదపెంకి ప్రసాదరావుకు 15, రాయల సత్యనారాయణకు 31, సుంకరి శ్రీనివాసరావుకు 33 ఓట్లు వచ్చాయి.

'గాదె'కు ధ్రువీకరణ పత్రం అందజేత

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొందిన గాదె శ్రీనివాసులునాయుడుకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ సోమవారం రాత్రి 11 గంటలకు ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఓట్ల లెక్కింపు ముగిసిన అనంతరం వివరాలను ఎన్నికల కమిషన్‌కు పంపి, అక్కడ నుంచి అనుమతి వచ్చాక అధికారికంగా ప్రకటించి ధ్రువపత్రం అందజేశారు. ఎన్ని కల ప్రక్రియ సజావుగా సాగేందుకు సహకరించిన అధికారులు, సిబ్బందికి కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు.అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా బందోబస్తు నిర్వహించిన పోలీసులను అభినందించారు.

ఓడిపోయినా.. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి: రఘువర్మ

విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పాకలపాటి రఘువర్మ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వెలువడడానికి కొద్ది నిమిషాలు ముందు కౌంటింగ్ కేంద్రం నుంచి బయటకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. తాను ఓటమిని అంగీకరిస్తున్నానని, అయితే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి మాత్రం పోరాటం చేస్తానని స్పష్టంచేశారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని స్పష్టం చేశారు.

ఎగుమతుల కేంద్రంగా విశాఖ

... 5వ పేజీ తరువాయి

పేర్కొంది. ఐటీ సేవలను విస్తృతం చేయడానికి మండల స్థాయిలో అధికారులతో సమీక్షలకు వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాట్లు చేస్తున్నామని, ఇకపై ఎవరూ ఎక్కడికీ వెళ్లకుండా సమీక్షల్లో పాల్గొనవచ్చునని వెల్లడించింది. పరిశ్రమలకు అవసరమైన విద్యుత్‌ను నిరంతరం అందించడానికి కాపులుప్పాడ, అచ్యుతాపురం, చందనాడల్లో 900 మెగావాట్ల సామర్థ్యంతో సబ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్టు, వాటి పనులు ఇప్పటికే 65.59 శాతం పూర్తయినట్టు పేర్కొంది. వీటివల్ల 1,200 పరిశ్రమలకు విద్యుత్ సదుపాయం అందుతుంది. మేహాద్రిగెడ్డలో 3 మెగావాట్ల సోలార్ ప్లాంటు, ముడసర్లోవ పార్కు పునరుద్ధరణకు 10,650 మొక్కలు నాటినట్లు తెలిపింది. విశాఖపట్నం నుంచి భీమిలి వరకు బీచ్‌రోడ్డులో 6/8 వరుసల ఎక్స్‌ప్రెస్ వే నిర్మించనున్నట్టు వెల్లడించింది.

విశాఖలో సముద్ర ఉత్పత్తులు పెంచడానికి ఓపెన్ సీ కేజ్ కల్చర్, డీప్ సీ ఫిషింగ్‌ను ప్రోత్సహించనున్నారు. టూనా చేపల వేటకు అవసరమైన అధునాతన ట్రాలర్ల సమకూర్చుకునేందుకు రుణ సాయం అందిస్తారు.

విశాఖపట్నం జిల్లాకు 1,39,501 గృహాలు మంజూరుచేయగా, వాటిలో 29,467 పూర్తయ్యాయని, ఇంకా 36,888 గృహాల పనులే ప్రారంభం కాలేదని నివేదికలో ప్రస్తావించారు. మిగిలిన గృహాలు వివిధ స్థాయిలో ఉన్నాయి.

ఉమ్మడి విశాఖ జిల్లాలో తొలి దశలో 2002 ఎకరాల్లో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేస్తున్నారని, రెండో దశకు మరో 4 వేల ఎకరాలు సేకరిస్తున్నట్టు పొందుపరిచారు.

- గిరిజన సహకార సంస్థ అరకు కాఫీకి ఆర్గానిక్ సర్టిఫికేషన్ తీసుకువచ్చిందని, మరింత మంది రైతుల పంటకు ఆ గుర్తింపు కోసం ప్రయత్నిస్తున్నదని, ఈ ఆర్థిక సంవత్సరంలో రెండు వేల టన్నుల కాఫీ సేకరణ లక్ష్యంతో పనిచేస్తున్నదని పేర్కొంది. కొయ్యూరు మండలం డౌనూరులో రూ.3 కోట్లతో ఇంటిగ్రేటెడ్ కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించింది.

జ్ఞానవేణికి ఉద్వాసన

... 5వ పేజీ తరువాయి

రుషికొండపై నిర్మించిన ప్యాలెస్ పనులను ఆయనే దగ్గరుండి పర్యవేక్షించారు. రుషికొండపై అంతకుముందున్న హరిత రిసార్ట్స్‌లోని ఫర్నీచర్‌ను అమ్ముకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రమణను తప్పించాలని విశాఖ జిల్లా ప్రజా ప్రతినిధులు కొందరు నేరుగా పర్యాటక శాఖ పెద్దలనే కోరారు. ఆర్‌డీగా అదనపు బాధ్యతలు ఇవ్వడం తగదని సూచించారు. ఆర్‌డీ కార్యాలయంలో సిబ్బంది కూడా ఆదాయం కోసం వెంపర్లాడుతున్నారని, వారిని కూడా మార్చాలని కోరారు. కానీ పర్యాటక శాఖ పెద్దలు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. విశాఖ నేతలు సూచించిన అధికారుల పేర్లను పక్కన పెట్టారు. ఇప్పుడు రుషికొండలో ఇంత రచ్చ జరిగిన తరువాత కూడా ఆ శాఖలో వారితోనే కుర్చీలాట ఆడారే తప్ప కఠిన చర్యలు ఏమీ తీసుకోలేదు. రమణను ఆర్‌డీగా తప్పించి అదే శాఖలో ఇక్కడే ఈఈగా ఉంచారు. రెండు జిల్లాల బాధ్యతలు చూస్తున్న దాస్‌ను తీసుకువచ్చి విశాఖ పర్యాటక శాఖ జిల్లా అధికారిగా నియమించారు. అలాగే డీవీఎంగా బీజీగా ఉండే జగదీశ్‌కు ఆర్‌డీగా అదనపు బాధ్యతలు ఇచ్చారు. పూర్తిస్థాయి అధికారులను వేయడానికి ఆ శాఖలో పెద్దలకు కలుగుతున్న ఇబ్బంది ఏమిటో అర్థం కావడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి ఇక్కడి అధికారులను మార్చాలనే అంతా చెబుతున్నారు. కానీ ఏ కారణాల చేతనో ఈఈ రమణతోనే వ్యవహారాలన్నీ నడిపిస్తున్నారు. కొత్త వారిని రానివ్వడం లేదు. జిల్లా నేతల అభ్యర్థనలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. పర్యాటక సంస్థలో మరొకాయన..'పత్రికల్లో చిన్నవే పెద్దవిగా రాస్తారు..వాటిని పట్టించుకోవద్దు" అంటూ పెట్టుబడిదారుల సదస్సులోనే ప్రకటించి అవినీతి అధికారులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ శాఖను పూర్తిగా ప్రక్షాళన చేయడం ఆ శాఖ పెద్దలకే ఇష్టం లేనట్టుగా ఉంది.

వాట్సాప్ ద్వారా టెన్త్ హాల్ టికెట్లు

... 5వ పేజీ తరువాయి

పుట్టిన తేదీ, మీడియం, ఫొటో, సంతకం, సబ్జెక్ట్ వంటివి పరిశీలించాలన్నారు. ఏమైనా పొరపాట్లు ఉంటే డైరెక్టర్, పరీక్షల విభాగానికి ఈ-మెయిల్ ద్వారా తెలియజేయాలని సూచించారు. విద్యార్థులు కూడా తమ హాల్ టిక్కెట్లను మన మిత్ర వాట్సాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చునన్నారు. ఇందుకోసం వాట్సాప్ నంబర్ 95523 00009కు 'హాయ్' అని మెసేజ్ చేస్తే అందులో శాఖల వారీగా అందుబాటులో ఉండే సేవల గురించి సమాచారం అందుతుందన్నారు. అందులో విద్యా శాఖను ఎంచుకొని ఎస్సెస్సీ హాల్ టిక్కెట్స్‌ను ఎంచుకోవాలని డీఈవో తెలిపారు.



పురవీధుల్లో ఘటాలను ఊరేగిస్తున్న భక్తులు

పోలమాంబ జాతర ప్రారంభం

అగనంపూడి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఫార్మాసిటీ పునరావాస కాలనీ ఈ-బోనంగి గ్రామస్తుల ఆరాధ్య దేవత పోలమాంబ జాతరను సోమవారం ఘనంగా ప్రారంభించారు. రెండు రోజులు పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఘటాలను గ్రామ పురవీధుల్లో డప్పు వాయిద్యాలు, తప్పెటగుళ్లు, కోలాటాల నడుమ ఊరేగించారు. రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కాగా మంగళవారం అమ్మవారి అనుపోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధి అట్టా సన్యాసి అప్పారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గురప్ప దేవుడు ఉత్సవాలు

పెదగంట్యాడ: నెల్లిముక్కు నిర్వాసిత కాలనీలో వారం రోజులుగా జరుగుతున్న గురప్ప దేవుడు ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. గురప్ప దేవుడను ప్రత్యేకంగా అలంకరించి, పీఠంపై అధిష్ఠింపజేసి పూజలు చేశారు. వారం రోజుల పాటు ఘటాల ఊరేగింపు చేపట్టారు. సోమవారం కలశ ఊరేగింపు జరిగింది. ఉత్సవ కమిటీ సభ్యులు జి.పరదేశమ్మ, అప్పలరెడ్డి, గురప్పరెడ్డి, గురునాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మెపై ప్రచారం

గాజువాక, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 7న తలపెట్టనున్న కార్మిక సమ్మెపై అఖిలపక్ష నాయకులు సోమవారం ప్లాంటులో విస్తృత ప్రచారం చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, జీతాలు సకాలంల చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సమస్యలు లేకుండా చూడాలని, పూర్తయిన టెండర్ల ప్రక్రియను పునరుద్ధరించి కాంట్రాక్టు కార్మికులకు ఉపాధి కల్పించాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో నాయకులు మంత్రి రవి, శ్రీనివాసరాజు, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సేతు విద్యా తరగతులు

పెందుర్తి-రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 95వ వార్డు పరిధి పాపయ్యరాజుపాలెం బ్రహర్షి పిరమిడ్ శక్తి క్షేత్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సేతు విద్యా తరగతులు సోమవారంతో ముగిశాయి. ఈ వర్క్ షాపులో ధ్యానం, అనుకూల, ప్రతికూల ఆలోచనలు, విశ్వశక్తి, తదితర అంశాల గురించి వివరించారు. పలువురు ధ్యానులు తమ అనుభవాలను తెలియజేశారు. సేతు విద్యా బోధకులు జి.బాలకృష్ణ, సునీత దంపతులతో పాటు శివరామరాజు, శ్రీనివాస్, శ్రీధర్ తదితరులను పిరమిడ్ మాస్టర్లు సత్కరించారు. క్షేత్రం వ్యవస్థాపకులు ఈశ్వరమ్మ, వాణి, జ్యోతి, కామేశ్వరరావు, సతీశ్, సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **శబ్దం :** సంగం, శారద, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక),
- **మజాకా :** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం),
- **డ్రాగన్:** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి),
- **తండేల్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, నరసింహ (గోపాలపట్నం), అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం :** మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 33, టమాటా 14, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 15, బెండకాయలు 44, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 40, బీరకాయలు 60, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 18, క్యాబేజీ 12, క్యారెట్ 30 దొండకాయలు 36, బంగాళదుంపలు 15, అరటికాయ (పె)7, అల్లం (పాతది) 52, మునక్కాడలు (కిలో) 74, ముల్లంగి 20, బరబాటి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 34, దోసకాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 110, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 30, కీరదోస 28, కాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 38 చిలగడ దుంపలు 40, కంద 64, దేముడుచిక్కుడు 52, గోరుచిక్కుడు 36, కూరపెండలం 26, బ్రకోలి 55, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 15, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 46, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	455
విజయనగరం	459
శ్రీకాకుళం	459

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	95
లైవ్ ధర	115
విత్ స్కిన్	200
స్కిన్‌లెస్	210

మృత్యు మార్గం..

- ప్రమాదాలకు కేరాఫ్ పెందుర్తి బైపాస్ రోడ్డు
- రహదారి విస్తరణతో ప్రమాదాలు
- ఇప్పటికే పదుల సంఖ్యలో మృత్యువాత
- పట్టించుకోని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు



సరిపల్లి ఆర్వోబీ వద్ద అడ్డదిడ్డంగా వాహనాల రాకపోకలు

పెందుర్తి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి నుంచి పెందుర్తి మీదుగా ఆనందపురం వరకు 55 కిలోమీటర్ల మేర నేషనల్ ఎక్స్‌ప్రెస్ హైవే విస్తరణ పనులపై అధికారుల పర్యవేక్షణ లేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రధానంగా ఎన్‌హెచ్-16 ఆరు లేన్ల రహదారి విస్తరణలో భాగంగా పెందుర్తి సమీపాన రాంపురం నుంచి సరిపల్లి మీదుగా గుర్రమ్మపాలెం పీఎస్ఎల్ కంపెనీ వరకు నిర్మించిన బైపాస్ రోడ్డులో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. మూల మలుపుల వద్ద ప్రమాదాలు జరుగుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. బైపాస్ రోడ్డు సరిపల్లి వద్ద నిర్మించిన రోడ్డు ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) ప్రమాదాలకు కేరాఫ్‌గా నిలుస్తోంది. అనకాపల్లి నుంచి ఆనందపురం వైపు వెళ్లే వాహనాలతో పాటు రాంపురం నుంచి, ఆనందపురం నుంచి అనకాపల్లి వైపు వచ్చే వాహనాలు, గుర్రమ్మపాలెం పీఎస్ఎల్ నుంచి వచ్చే వాహనాలు సరిపల్లి బిడ్జి నుంచి సమీపంలో టర్నింగ్ తీసుకుని అటు పెందుర్తి నుంచి నగరంలోకి ప్రవేశిస్తాయి. అలాగే కొత్తవలస మీదుగా పర్యాటక ప్రాంతం అరకు, విజయనగరం వెళ్లేందుకు ఇది దగ్గరి మార్గం. దీంతో నిత్యం వందలాది వాహనాలు ఈ ఆరు లేన్ల రహదారిపై ప్రయాణిస్తూ సరిపల్లి బ్రిడ్జి వద్ద యూటర్న్ తీసుకుని ప్రయాణిస్తుంటాయి.

సరిపల్లి బైపాస్ బ్రిడ్జి వద్ద అస్తవ్యస్తం..

ఆరు లేన్ల రహదారిపై వెళ్తున్న వాహనాలు అదే వేగంతో సరిపల్లి బైపాస్ బ్రిడ్జి వద్ద యూటర్న్ తీసుకోవడంతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారుతోంది. దీంతో ఈ వైపుగా రాకపోకలు సాగించే వాహనదారులు భీతిల్లుతున్నారు. కనీసం ప్రమాద హెచ్చరిక బోర్డులు, స్పీడ్ లిమిట్ బోర్డులు లేకపోవడంతో పలువురు ఇష్టారాజ్యంగా వాహనాలు నడుపుతుండడంతో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఇక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో పదుల సంఖ్యలో పలువురు మృత్యువాత పడ్డారు. కనీసం ఈ రహదారి ఎటువైపు వెళ్తుందో కూడా సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనచోదకులు అయోమయానికి గురవుతున్నారు. ఈక్రమంలో భారీ వాహనాలు రాత్రిపూట యూటర్న్ తీసుకుని బ్రిడ్జి దిగి బైపాస్ రోడ్డు మీదకు వస్తుండడం... వాటిని గమనించక వేగంగా వస్తున్న వాహనాలు ఢీకొనడంతో ప్రమాదాలు జరిగిన సందర్భాలు ఉన్నాయి.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?

ఇక్కడి బైపాస్ బ్రిడ్జి సమీపంలో జరిగిన అనేక రోడ్డు ప్రమాదాల్లో పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోగా, మరెంతో మంది క్షతగాత్రులయ్యారు. ఇటీవల యానాం నుంచి నగరానికి కారులో వస్తున్న మిత్రుల బృందం ఇక్కడి బైపాస్ రోడ్డు యూటర్న్ తెలియక డివైడర్‌ను ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు. షీలానగర్ నుంచి పెందుర్తికి రెండు బైకులపై వస్తున్న ఇంజనీరింగ్ విద్యార్థులు ఇక్కడి మలుపులను అంచనా వేయలేక వాహనాలు స్కిడ్ అవ్వడంతో ఓ విద్యార్థి తనువు చాలించాడు. వెనక కూర్చున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అలాగే శ్రీకాకుళం నుంచి వస్తున్న పెళ్లి బృందం వ్యాన్ సరిపల్లి బైపాస్ బ్రిడ్జి వద్ద ఆగివున్న లారీని ఢీకొనడంతో ముగ్గురు మృతి చెందగా, ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఇక్కడ జరిగిన ప్రమాదంలో నూతన జంటలో భర్త అక్కడికక్కడే మృతి చెందగా, భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. అందువల్ల ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ఇప్పటికైనా స్పందించి మృత్యుమార్గంగా మారుతున్న బైపాస్ రోడ్డులో ప్రమాదాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.



పినగాడి కూడలి వద్ద భీతిగొల్పుతున్న బైపాస్ రోడ్డు

భీతిగొల్పుతున్న పినగాడి జంక్షన్

పెందుర్తి సమీపం పినగాడి జంక్షన్ వద్ద గల బైపాస్ బ్రిడ్జి భీతిగొల్పేలా మారింది. ఇక్కడి మూడు రోడ్ల కూడలిలో అనకాపల్లి, పెందుర్తి వైపు ప్రయాణించే వాహనాలతో పాటు వేపగుంట, పినగాడి రహదారి మీదుగా.. చోడవరం, మాడుగలకు ఇదే రోడ్డు కనెక్టివిటీ కావడంతో నిత్యం వందలాది మంది ఈ మార్గంల రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడి యూటర్న్ తీసుకుని సరిపల్లి మీదుగా ఆనందపురానికి భారీ సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. అయితే మూడు రోడ్ల కూడలి వద్ద ఎటువంటి సూచిక బోర్డులు లేకపోడంతో వాహనదారులు అయోమయానికి గురవుతుండడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రాత్రి వేళల్లో ఈ మార్గంలో రాకపోకలు సాగించడం మరింత ఇబ్బందికరంగా ఉంటుందని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కనుమరుగవుతున్న మహిళా చట్టాలు

- ఏపీ మహిళా సమాఖ్య

రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల



కార్యక్రమంలో మాట్లాడుతున్న విమల

పెందుర్తి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మహిళల చట్టాలు నిర్వీర్యంతో హక్కులు, భద్రత కనుమరగవుతున్నాయని ఏపీ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల అన్నారు. మహిళా సమాఖ్య పెందుర్తి ఏరియా సమితి ఆధ్వర్యంలో సోమవారం సుజాతనగర్ నుంచి గిరిప్రసాద్ నగర్ వరకు మహిళా దినోత్సవ వారోత్సవాల ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలపై హింసను అరికట్టాలని, చట్టసభలో 33 శాతం రిజర్వేషన్‌ను అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. అనంతరం విమల సమాఖ్య పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఉద్యమాలతోనే మహిళలు హక్కులను సాధించుకోవాలన్నారు. సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎంఏ బేగం మాట్లాడుతూ బీజేపీ కేంద్రపాలిత రాష్ట్రాల్లో మహిళల హింస అధికంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యురాలు పుష్ప, పెందుర్తి ఏరియా ప్రతినిధులు ఎ.అన్నపూర్ణ, ఎన్.అరుణ, పావని, లక్ష్మి, విజయ, తదితరులు పాల్గొన్నారు.



భారీ లోడుతో వాహనం నడుపుతూ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతున్న డ్రైవర్

భారీ లోడు.. నిబంధనలు పట్టించుకోరు!

డ్రైవింగ్ చేస్తూ ఫోన్ మాట్లాడకూడదన్న నిబంధనను వాహన చోదకులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. భారీ లోడుతో మినీ ట్రాన్స్‌పోర్ట్ వాహనం నడుపుతున్న ఓ చోదకుడు ఇలా నిర్లక్ష్యంగా సెల్‌ఫోన్ మాట్లాడుతూ సోమవారం పురుషోత్తపురం వద్ద కనిపించాడు.

-విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

నేడు విద్యుత్ లైన్‌మన్ దివస్

విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నిరంతర విద్యుత్ సరఫరాకు సహకరించే లైన్‌మన్లను సత్కరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మార్చి 4న 'లైన్‌మన్ దివస్' గా నిర్వహించాలని, ఉత్తమ సేవలుందించిన లైన్‌మన్లను గుర్తించి సత్కరించాలని సూచించింది. ఈ మేరకు తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ప్రతి డివిజన్ నుంచి ఇద్దరు లైన్‌మన్లను గుర్తించి మంగళవారం సన్మానించడానికి ఏర్పాట్లు చేసింది. వినియోగదారులకు ఎటువంటి సమస్య లేకుండా నిరంతర విద్యుత్ అందించేందుకు కృషిచేస్తున్న తమను గుర్తించి, సన్మానించడం గొప్ప విషయమని లైన్‌మన్లు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. జిల్లాలో సుమారు 750 మంది లైన్‌మన్లు ఉండగా వారిలో డివిజన్‌కు ఇద్దరు చొప్పున మొత్తం ఆరుగురిని మంగళవారం సత్కరించనున్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు: మాజీ ఎమ్మెల్యే 'మళ్ల'

పెందుర్తి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిషత్తు ఉంటుందని మాజీ మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ అన్నారు. పెందుర్తి సమీపం పినగాడిలో ఉన్న విస్టం ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం స్పోర్ట్స్ వీక్‌ను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మధ్య పోటీతత్వాన్ని నింపేందుకు ఏటా విస్టంలో స్పోర్ట్స్ వీక్‌ను నిర్వహించడం జరుగుతుందన్నారు. ముందుగా శాంతిని కాంక్షిస్తూ గాలిలోకి పావురాలు, బెలూన్లను ఎగురవేశారు. విస్టం మైదానంలో వివిధ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ మళ్ల అనూష, బొల్లినేని సందీప్, ట్రెజరర్ మళ్ల అలేఖ్య, సెక్రటరీ రాహుల్, మళ్ల అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

'థంబ్ రూల్స్'పై విజ్ఞాన్ విద్యార్థులకు అవగాహన

అగనంపూడి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో థంబ్ రూల్స్ ఫర్ థర్మల్ కంఫర్ట్ అనే అంశంపై సోమవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ డాక్టర్ కె.కిరణ్‌కుమార్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ థర్మల్ కంఫర్ట్ ప్రాముఖ్యత, ఇంజనీరింగ్ రంగంలో దాని వినియోగం వంటి అంశాల గురించి వివరించారు. పలువురు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం విజ్ఞాన్ యాజమాన్య ప్రతినిధులు కిరణ్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల ఆలయ వార్షికోత్సవం

పెందుర్తి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పినగాడి పంచాయతీ పరిధి కోట్నివానిపాలెంలో గల సీతారాముల ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయ స్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో సర్పంచ్ బి.వెంకటలక్ష్మీ జయరామ్, తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్న సమారాధనను చేపట్టారు.



చెత్తకు నిప్పంటించడంతో ఎగసిపడుతున్న మంట

చెత్తకుప్పలకు నిప్పంటించిన ఆకతాయిలు

ఆటోనగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి తిరుమలనగర్‌ను ఆనుకుని ఉన్న ఆటోనగర్ ఈ-బ్లాకులో ఉన్న చెత్త డంపింగ్ యార్డులోని చెత్తకుప్పలకు సోమవారం తెల్లవారుజామున ఆకతాయిలు నిప్పటించారు. దీంతో దట్టమైన పొగ వ్యాపించడంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పొగ మూలంగా వృద్ధులు, చిన్నారులు, ఆస్తమా బాధితులు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఇక్కడి డంపింగ్ యార్డును తరలించేందుకు అధికారులు తగిన చర్యలు చేపట్టాలని తిరుమలనగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు కె.నాగభూషణం, జి.విశ్వేశ్వరరావు, ఎం.పరమానందం, పరమేశ్వరరావు, సన్యాసిరావులు కోరారు.

కత్తితో దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

కూర్మన్నపాలెం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఒకరిపై కత్తితో దాడికి పాల్పడిన వ్యక్తిని సోమవారం దువ్వాడ పోలీసులు అరెస్టు చేశారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదగంట్యాడ మండలం అప్పికొండ సమీప చేపల పాలెంలో చీడిపల్లి పరదేశి కుటుంబంతో ఉంటున్నాడు. ఆదివారం రాత్రి పరదేశి ఇంటికి అదే గ్రామానికి చెందిన చోడిపల్లి ప్రసాద్ వచ్చి నీ పెద్ద కొడుకు శివాజీ ఎక్కడ ఉన్నాడు, చంపేస్తానని బెదిరించాడు. ఏం జరిగిందని పరదేశి అడగ్గా.. శివరాత్రి నాడు తన స్నేహితుడు కుమారుడు శివకుమార్‌ను శివాజీ కొట్టాడని ప్రసాద్ తెలిపాడు. శివాజీని చంపితే రూ.30 లక్షల సుపారీ ఇస్తానని శివకుమార్ చెప్పాడని, అందువల్ల శివాజీని హతమారుస్తానని ఇంట్లోకి ప్రవేశించబోయాడు. దీంతో చుట్టుపక్కల వారితో పాటు పరదేశి అడ్డుకోవడంతో ప్రసాద్ కత్తితో దాడి చేశాడు. పరదేశి ఎడమ చేతికి స్వల్ప గాయం కావడంతో భయభ్రాంతులకు గురైన ఆయన కోడలు డయల్ 100కు ఫోన్ చేసింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చోడిపల్లి ప్రసాద్‌ను అరెస్టు చేశారు. ప్రసాద్, శివకుమార్‌ల వల్ల తమ కుటుంబానికి హాని ఉందని, రక్షణ కల్పించాలని పరదేశి పోలీసులను కోరాడు. పరదేశి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న శివకుమార్ కోసం గాలిస్తున్నారు.

మద్యం కొనుగోలుకు డబ్బులివ్వలేదని ఆత్మహత్య



మృతుడు శివకృష్ణ (ఫైల్)

గోపాలపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన ఓ వ్యక్తి మందు తాగడానికి కుటుంబ సభ్యులు డబ్బులివ్వకపోవడంతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లక్ష్మీనగర్‌కు చెందిన గోక శివకృష్ణ (35) ఉల్లిపాయల వ్యాపారం చేస్తుంటాడు. శివకృష్ణ మద్యానికి బానిసవ్వడంతో భార్య విడిచిపెట్టి వెళ్లిపోయింది. తల్లిదండ్రులతో నివసిస్తున్న శివకృష్ణ తరచూ మద్యం కొనుగోలుకు డబ్బులివ్వాలంటూ తల్లిదండ్రులను వేధించేవాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం వారు డబ్బులు ఇవ్వకపోవడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని శివకృష్ణ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆ తరువాత ఇంటికి వచ్చిన కుటుంబీకులు గోపాలపట్నం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని శివకృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి తల్లి దమయంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ గొలగాని అప్పారావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్త కనిపించడం లేదంటూ ఫిర్యాదు



శివప్రసాద్ (ఫైల్ ఫొటో)

పెందుర్తి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి విధులకు వెళ్లిన తన భర్త తిరిగి రాకపోవడంతో ఓ మహిళ సోమవారం పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెందుర్తి జేఎన్ఎన్ఎంయూఆర్ కాలనీకి చెందిన నరవ శివప్రసాద్ ఆరిలోవలోని ఓ ఆస్పత్రిలో బాయ్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల ఒకటో తేదీన డ్యూటీకి వెళ్లిన శివప్రసాద్ తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్లలో ఆరా తీసినా ఆచూకీ లభ్యం కాలేదంటూ భార్య జయలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



క్విజ్ పోటీలో విజేతగా నిలిచిన విద్యార్థికి జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

ఘనంగా జాతీయ విజ్ఞాన దినోత్సవం

గోపాలపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో 25 పాఠశాలల నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సీనియర్ విభాగంలో ప్రథమ స్థానంలో నడుపూరు జెడ్పీ హైస్కూల్, ద్వితీయ స్థానంలో ఎల్లపువానిపాలెం జెడ్పీ హైస్కూల్, తృతీయ స్థానంలో ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. జూనియర్స్ విభాగంలో ప్రథమ స్థానంలో బాలాజీ ఇంగ్లిష్ మీడియం స్కూల్, ద్వితీయ స్థానంలో ఎన్నారై ఇండియన్ స్ప్రింగ్ స్కూల్ విద్యార్థులు నిలిచారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు మాట్లాడుతూ విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని నూతన ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. పాఠశాల హెచ్ఎం వేణుగోపాలరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కె.ప్రసాద్, ఎన్‌జీసీ జిల్లా సమన్వయకర్త ఎస్.బాబూరావు, ఏపీ ఎస్ఎస్ఏ డాక్టర్ జె.చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

6న ఆలయాల్లో అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ



అక్కిరెడ్డిపాలెంలో పునఃప్రారంభానికి సిద్ధమైన అమ్మవార్ల ఆలయం

అక్కిరెడ్డిపాలెం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అక్కిరెడ్డిపాలెం కాలనీ ప్రజలు ప్రతిష్ఠాత్మకంగా హైస్కూల్ మైదానంలో పునర్నిర్మించిన కుంచుమాంబ, దుర్గమాంబ ఆలయంలో ఈ నెల ఆరున అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. హైస్కూల్ మైదానంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న కుంచుమాంబ, దుర్గమాంబ అమ్మవారి ఆలయాలు శిథిలావస్థకు చేరుకోవడంతో గత ఏడాది ఈ ఆలయాల వెనక ఆలయ పునర్నిర్మాణానికి కాలనీవాసులు శ్రీకారం చుట్టారు. పెద అక్కిరెడ్డిపాలెం, చిన అక్కిరెడ్డిపాలెం కాలనీలలో ప్రజలు రాజకీయాలకు అతీతంగా ఈ ఆలయాల నిర్మాణానికి భారీ విరాళాలను అందచేయడంతో అత్యంత సుందరంగా ఈ ఆలయం పునర్ నిర్మించబడింది. ఈ ఆలయ ప్రారంబోత్సవంలో బాగంగా ఈనెల 4 నుంచి ఈ ఆలయం వద్ద ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రెండు రోజుల పాటు హోమాలు, పూజలు అనంతరం ప్రముఖ వేద పండితులచే ఈనెల 6 వ తేదీని అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్ఠించడంతో పాటు భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు కమిటీ తెలిపారు.

సెల్ టవర్ వద్దంటూ నిరసన

మల్కాపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రకాశనగర్ శివాలయ సమీపంలోని ఓ ఇంటిపై సెల్ టవర్ ఏర్పాటు చేయడాన్ని స్థానికులు అడ్డుకున్నారు. ఇక్కడ సెల్ టవర్ ఏర్పాటు చేయడం వల్ల వచ్చే రేడియేషన్ వల్ల వివిధ రుగ్మతలకు గురవుతామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో ఇరుకుగా ఉండే ఈ వీధిలో సెల్ టవర్ ఏర్పాటు చేయడానికి తాము అంగీకరించమంటూ నిరసన వ్యక్తం చేశారు. ఈలోగా మల్కాపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అందరూ పోలీస్ స్టేషన్‌కు వచ్చి సీఐ సమక్షంలో చర్చించాలని చెప్పడంతో అప్పటికి సమస్య సద్దుమణిగింది.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఆళ్వార్స్ విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల అధ్యాపకులు, తదితరులు

వేపగుంట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గోపాలపట్నం బంకు సమీపం ఆర్ఆర్‌వీ పురం ఆళ్వార్స్ క్యాంపస్‌లో సోమవారం యోకహోమా టైర్స్ తయారీ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఇంటర్వ్యూల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆళ్వార్స్ డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్, ఇతర కళాశాలలకు సంబంధించి మొత్తం 279 విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరవ్వగా 52 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు యోకహోమా టైర్స్ సంస్థ హెచ్.ఆర్ గుర్జార్ ఒక ప్రకటనలో తెలిపారు. వీరందరికీ నియామక పత్రాలను అందజేశారు. ఎంపికైన విద్యార్థులను ఆళ్వార్స్ గ్రూప్ సెక్రటరి డాక్టర్ ఎస్‌వీహెచ్ రాజేంద్ర, ఈడీ సుంకరి రాహుల్ ఆళ్వార్‌దాస్, గోపాలపట్నం క్యాంపస్ కో-ఆర్డినేటర్ జీవీఏఎస్ భగవాన్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ తులసీ కృష్ణకుమార్, ప్రిన్సిపాళ్లు గోపి, సీహెచ్ రాజు, ఇతర విభాగాధిపతులు అభినందించారు.

నష్ట పరిహారం పెంచాలని రైతుల ఆందోళన

పెందుర్తి-రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 95వ వార్డు పరిధి పొర్లుపాలెం నుంచి నార్త్ సింహచలం వరకు రైల్వే బ్రిడ్జి నిర్మాణం నిమిత్తం రైతుల నుంచి సేకరించే భూములకు నష్ట పరిహారం పెంచి, చెల్లించాలని డిమాండ్ చేస్తూ గ్రామ రైతులు సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మాజీ ఉప సర్పంచ్ గల్లా వెంకటరమణ మాట్లాడుతూ ప్రభుత్వ అవసరాల నిమిత్తం గతంలో ఈ ప్రాంత రైతుల నుంచి భూములను సేకరించడం జరిగిందని, అప్పుడు చెల్లించినట్టే ఇప్పుడు కూడా రైల్వే శాఖ నష్ట పరిహారం చెలించాలని కోరారు. రైతుల ఆదీనంలో గల దేవస్థానం భూములకు సంబంధించి కూడా రైతులకు న్యాయం చేయాలన్నారు. ఇదే అంశంపై మంగళవారం పెందుర్తి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామన్నారు.

'స్టీల్‌ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడపాలి'

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడపాలని సీఐటీయూ ప్లాంట్ అధ్యక్షుడు వైటీ దాసు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్లాంట్ బీఎఫ్ విభాగం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాంటును నిర్వీర్యం చేసేందుకు కుట్ర జరుగుతుందన్నారు. బీఎఫ్-3లో ఉత్పత్తిని ప్రారంభించాలన్నారు. ప్లాంటును కాపాడుకునేందుకు రాజకీయ చైతన్యంతో కూడిన కార్మిక పోరాటాలు అవసరమన్నారు. కార్యక్రమంలో నాయకులు డీవీ రమణారెడ్డి, రాజు, రమణ, వేణుగోపాల్, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలనగర్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై సర్వే



సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

కూర్మన్నపాలెం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి తిరుమలనగర్‌లో కాలనీవాసులు సోమవారం స్వచ్ఛ సర్వేక్షణ్ సిటిజన్ ఫీడ్ బ్యాక్ సర్వేను నిర్వహించారు. ఈ సర్వేలో ప్రజలంతా పాల్గొని సుందర విశాఖకు ప్రథమ స్థానం వచ్చేలా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ ప్రతినిధి పరమానందం మాట్లాడుతూ ప్లాస్టిక్ నియంత్రణ అనే చిన్న ప్రయత్నంతో భావిభారత సమాజ మనుగడకు ప్రయత్నిద్దామన్నారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగానికి బదులుగా క్లాత్ సంచులను అందరూ వాడాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పరమేశ్వరరావు, సన్యాసిరావు, వసంత రెడ్డి, రాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.